జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్


సంపుటి- 9 సంచిక - 01
పక్షపత్రిక జనవరి 1-15-2018







## కొత్తతరం నాయకత్వాన్ని సమకూర్చటానికే 'యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్' : జేపీ



## గుజరాత్ సురాజ్య సందేశం

## 2జీ కేసులో దేశానికి జరిగిన ఒకే ఒక్క మేలు లోక్‌సత్తా పిటిషన్ ద్వారానే జరిగింది

# అవినీతి అధికారులను పట్టిస్తే క్యాష్ ప్రైజ్

"అవినీతి అధికారులను ఏసీబీకి పట్టించండి... నగదు నజరానా పొందండి"... వరంగల్‌కు చెందిన అవినీతి వ్యతిరేక సంస్థ జ్వాల రూపొందించిన ఈ పోస్టర్లను లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. జిల్లా స్థాయి అధికారులను ఏసీబీకి పట్టించిన వారికి రూ.20 వేలు, మండల, గ్రామస్థాయి అధికారుల విషయంలో రూ.15 వేలు, రూ.10 వేలు నగదును ప్రోత్సాహకంగా అందిస్తామని జ్వాల స్వచ్ఛంద సంస్థ సలహాదారుడు ఎం. శ్రీనివాసమాధవ్, అధ్యక్షుడు ఎస్. ప్రశాంత్ పేర్కొన్నారు.



తొలుత ఉమ్మడి వరంగల్ జిల్లాలో అమలు చేస్తామని, ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని తెలిపారు. జ్వాల అవినీతి వ్యతిరేక కార్యక్రమాలకు లోక్‌సత్తా మద్దతుంటుందని చెబుతూ జేపీ వారిని అభినందించారు.





# పౌరసేవల చట్టం తేవాలి

ప్రజలను వేధిస్తున్న రోజువారీ అవినీతి పోవాలంటే ప్రభుత్వ కార్యాలయాల్లో పౌరసేవల చట్టాన్ని అమలు చేయాలని లోక్‌సత్తా నేతలు అన్నారు. ఈ చట్టం నమూనాను లోక్‌సత్తా రూపొందించి పంపినా, తెలంగాణ ప్రభుత్వం ఇంకా తాత్సారం చేస్తోందన్నారు. అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం అవినీతి దిష్టిబొమ్మను దహనం చేశారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గారావు, కార్యదర్శి సరోజాదేవి, విద్యార్థిసత్తా అధ్యక్షుడు రాజీవ్, కార్యదర్శి పూర్ణచందర్, రంజిత్, వెంకటేష్, విమలాదేవి తదితరులు పాల్గొన్నారు. సూర్యాపేటలో నిర్వహించిన కార్యక్రమంలో లోక్‌సత్తా జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లేటి రమేష్ కుమార్, ఇంఛార్జ్ సత్తెయ్య, నల్గొండ ఇంచార్జ్ శ్రీనివాసరావు, భీమయ్య, కిరణ్, పుష్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# నేరచరిత్ర కలిగినవారిని నియంత్రించాలి



నేరచరిత్ర కలిగిన, అవినీతిపరులైన ప్రజాప్రతినిధులపై విచారణ చేసేందుకు ప్రత్యేక కోర్టుల్ని ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా చాన్నాళ్లుగా కోరుతోందని, ఈ దిశగా సుప్రీంకోర్టులో ముందడుగు పడటం మంచి పరిణామమని పార్టీ తెలంగాణ అధ్యక్షుడు డా॥ పాండురంగారావు అన్నారు. ప్రత్యేక కోర్టులతో పాటు స్వతంత్ర ప్రాసిక్యూషన్ ఏర్పాటుకు వేగంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల అధికారి నాగిరెడ్డిని కలిసి కోరారు. దుర్గారావు, సరోజాదేవి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

జనవరి 1-15, 2018 సంపుటి - 9 సంచిక - 01



# కార్టూన్ కార్నర్

## లోపలి పేజీల్లో...

సురాజ్య యాత్ర ఎందుకోసం ? .................... 5
సురాజ్య పరిష్కారాలపై ............................. 8
సురాజ్య లక్ష్యాల కోసం పనిచేయటం కంటే..... 16
బ్రిటన్ తీవ్ర సంక్షోభంలో కూడా ఎందుకు ........ 18
మాట్లంలో మార్పుని అడ్డుకోవటం .............. 20
మన వద్ద బెంచ్ మార్క్‌లేవీ?........................ 22
విద్యతోనే కులాలకతీతంగా గౌరవం............. 23
షేక్స్పియర్‌కి దక్కుతున్న గౌరవం మొల్లకు........ 24
పేషెంట్లు నెలకు 18,000 మంది................. 25
ఎన్నికల రాజకీయ వ్యవస్థే ఏకైక మార్గం కాదు... 26
సురాజ్య స్థాపన కోసం కృషి చేసే పార్టీలకు...... 27
నాణ్యమైన విద్యతోనే నిజమైన విప్లవం............ 28
డిజిటల్ అక్షరాస్యతపై అందరూ .................. 29
ప్రాచీనమా ? ఆధునికమా ?........................ 30
ఒంటరి పోరాటం చేస్తున్న జేపీ .................... 33
2జీ కుంభకోషంపై తీర్పు ఆశ్చర్యపరచలా......... 34

## సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ప్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836*, **SBI** పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

IFSC No: SBIN0020072

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజీ | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి



# గుజరాత్ సురాజ్య సందేశం

ఎన్నికల్లో ఎలాగోలా గెలవటమే రాజకీయం అనే పరిమితిలోనే జరిగినా గుజరాత్ తాజా అసెంబ్లీ ఎన్నికలు చాలా విలువైన సందేశాన్ని పాలకులకు, పార్టీలకు, దేశానికి ఇస్తున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలకు అర్థమయ్యే రీతిలోనే, వాటి సాంప్రదాయ రాజకీయం పరిధిలోనే ఈ సందేశం దాగి ఉంది. గుజరాత్‌లో వరసగా ఆరోసారి అధికారంలోకి రావటం చిన్న విషయం కాదు. కానీ ప్రధాని మోదీ పార్టీకి గెలుపు పెద్ద విషయంకాని పరిస్థితులే తొలినుంచీ అక్కడ ఉన్నాయి. ఎన్నికల సమయం వచ్చేసరికి మాత్రమే మోదీ బెంబేలెత్తాల్సి వచ్చింది. తన అరచేతిలోనే తారట్లాడుతూన్న అధికారం కాంగ్రెస్ పార్టీ చేతిలోకి వెళ్లిపోతుందన్న భయం మోదీని కుదిపేసింది. ఆరోసారీ బుల్లెట్ దిగలేదు, బచ్‌గయా అని ఊపిరిపీల్చుకోవాల్సి వచ్చింది. హిమాచల్‌ప్రదేశ్‌లో బీజేపీ గెలుపుకన్నా, గుజ్‌లో మోదీ పార్టీ ఎంత మెజారిటీతో అధికారాన్ని నిలబెట్టుకుంది అనే దానికన్నా కూడా.. గెలుపు అవకాశాలున్న దశ నుంచి గట్టెక్కితే చాలు అనే స్థాయికి దిగజారి చెమటలు కక్కాల్సిన పరిస్థితి మోదీ పార్టీకి ఎందుకొచ్చింది అనేదే చర్చనీయాంశం! నిజానికి గుజరాత్‌లో మోదీ పార్టీకి సానుకూల పరిస్థితుల వెనక.. 'ప్రత్యామ్నాయం లేదు' (టీనా) అనే భావన ఉంది. కాంగ్రెస్ కంటే కాస్త మెరుగైన ప్రతిపక్షం ఉంటే, ఓటు వేయాలని గుజరాతీలలో పలువురు భావించారు. చివరకు ఎజెండాపరంగా పెద్దగా కసరత్తు లేకుండా మోదీ తరహాలో ప్రచారగిమ్మిక్కులను, కులకూర్పులను కాంగ్రెస్ చేయటంతోనే.. రంగులు వెలిసిపోయినట్టు మోదీ ఆత్మరక్షణలో పడాల్సి వచ్చింది. దీనికంతటికీ కారణం పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ అనే వాదనలున్నాయి. నోట్ల రద్దు మోదీ ఇమేజ్‌ని భారీగా పెంచిందని మనం మర్చిపోకూడదు. అమలులో దాని ఫలితాలు కనిపించకపోవటంతోనే తేడా మొదలైంది. అసమర్థంగా వ్యవహరించటం, నోట్ల రద్దు లక్ష్యాలైన నల్లధనం, అవినీతి నిరోధాలను సాధించటానికి ఇతర సంస్కరణల్ని అమలుచేయకపోవటం వల్ల అదో వృథా ప్రయాసగా తయారై ప్రజల్లో వ్యతిరేకత కలిగింది. అలాగే జీఎస్టీ విషయంలో చర్చించి, అవరోధాలను తొలగించే చర్యలు అమలుచేయకుండా, పన్నులకు తగ్గ సేవలందించకుండా తన పుర్రెలో పుట్టిన ఐడియాలను అమలు చేయాల్సిందే అన్నట్టు మోదీ అనుసరించారు. ఇలా నోట్ల రద్దు, జీఎస్టీల నిర్ణయాల కంటే.. వాటి రూపకల్పన, అమలు తీరులోనే మోదీ విఫలమయ్యారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అనుసరించిన తీరునే ప్రధాని మోదీ అనుసరించటం వల్లే ఈ కార్యక్రమాల్లో సమస్యలు తలెత్తాయి. లోక్‌సత్తా ఉద్యమ సంస్థ 2004లో పశ్చిమ గోదావరి జిల్లా కళ్లచెర్వులో పైలట్ ప్రాజెక్టు ద్వారా విద్యుత్తు పంపిణీ నష్టాల్ని 30 శాతం నుంచి 16శాతానికి లోక్‌సత్తా తగ్గించింది. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులో అవినీతి లేకుండా రైతులకు వెంటనే సరఫరా జరిగేలా చేసింది. విద్యుత్ రంగంలో వికేంద్రీకరణ చేపడితే పంపిణీలో నష్టాలు తగ్గి భారీగా ప్రజాధనం ఆదాకావటంతోపాటు అవినీతి తగ్గుతుందని, ప్రతి గ్రామంలో ఇద్దరకు ఉద్యోగాలు కూడా వస్తాయని, వ్యవసాయ ఫీడర్లను వేరు చేస్తే గ్రామాలకు 24గంటలూ విద్యుత్తు అంది ఉపాధి పెరుగుతుందని లోక్‌సత్తా అప్పటి ప్రభుత్వాలకు నివేదిక ఇచ్చింది. బీజేపీ అగ్రనేత అరుణ్‌జైట్లీ స్వయంగా లోక్‌సత్తా కార్యాలయానికి వచ్చి ఈ వివరాలను తెలుసుకున్నారు. ఆ తర్వాత గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్రమోదీ అవే విద్యుత్ సంస్కరణల్ని అమలు చేశారు. ఆయన ప్రధాని కావటంలో గ్రామాలకు 24గంటల విద్యుత్ చుట్టూ విజయగాథలు కీలకపాత్ర పోషించాయి. కానీ ఆ తర్వాతి దశకు రాష్ట్రాన్ని తీసుకెళ్లే ఎజెండా మోదీకి కొరవడింది. దీంతో నిరంతర విద్యుత్, సాగునీటితో బాగుపడ్డ గ్రామాల నుంచే వ్యతిరేకత మొదలైంది. తన హాఫ్ బేక్డ్ ఆలోచనను విస్తృతపరుచుకునేందుకు, మెరుగైన పరిష్కారాలను ఆహ్వానించేందుకు 2014 ఎన్నికల సమయంలో చేసిన ప్రయత్నానికి విజయం తర్వాత కూడా మోదీ కట్టుబడి ఉంటే ఆ లోపాన్ని పూరించుకునేవారు. కానీ గుజరాత్ నమూనానే దేశ ప్రధానిగా కూడా అనుసరించే ధోరణిని మోదీ అనుసరించారు. దీంతో దేశవ్యాప్తంగా రాజుకుంటున్న అసంతృప్తి గుజరాత్‌లో తీవ్రరూపాన్ని సంతరించుకుంది. నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, స్థానిక ప్రభుత్వాలకు సాధికారత, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల్లేని సేవలు, వ్యవసాయంలో ఆదాయం కోసం మోదీ నుంచి కనీస ప్రయత్నం లేదు. ఈవేళ గుజరాత్ ఎన్నికల్లో పాటీదార్ల రిజర్వేషన్ ఉద్యమం దగ్గర్నుంచీ పలు అసంతృప్తులు, ఆగ్రహాలు తలెత్తటానికి మూలాలు వీటిల్లోనే ఉన్నాయి. గుజ్ విద్యార్థుల్లోనూ 8వ తరగతి చదువుతున్నవారిలో 25శాతం మందికి చదవటం రాదు, దాదాపు 50శాతం మందికి భాగాహారాలు చేతకావు. వీరికి ఆధునిక ఆర్థిక వ్యవస్థలో ఉపాధి ఎలా దొరుకుతుంది? ఉనా తరహా వివక్ష, ఘటనలు ఎలా ఆగుతాయి? గుజరాత్ గ్రామీణ ప్రాంతంలో ఆస్పత్రి కేసుకు సగటు ఖర్చు రూ.32,500. ఉత్తర ప్రదేశ్‌లో అవుతున్న ఖర్చు కంటే ఇది దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ. ఆస్పత్రి ఖర్చు భరించలేక పలువురు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. మరి పేదరికం ఎలా పోతుంది? వ్యవసాయంలో ఎగుమతుల్ని పెంచి దిగుమతుల్ని తగ్గించే విధానాలను అనుసరించటం వల్ల గత మూడేళ్లలోనే ఏటా రూ.1,30,000కోట్ల మేర మన రైతులకు డిమాండ్ పడిపోయింది.. ఇవన్నీ గుజరాత్ ఎన్నికల్లో ప్రతిఫలించాయి. ఇవన్నీ మోదీ స్వయంకృతాలే. ఈ ఎన్నికల్లో ప్రజల్లో వ్యతిరేకత కనిపించింది కాబట్టి.. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పైకి కనిపించకుండా తాను ప్రోత్సహిస్తున్న ప్రజాకర్షక విధానాలను బహిరంగంగా అమలుచేయాలన్న ఆలోచనలు చేస్తే ప్రధాని ఇంకా వైఫల్యంలో కూరుకుపోతారు. అందరికీ నాణ్యమైన విద్యను, ఆరోగ్యాన్ని అందించటం మనకున్న బడ్జెట్‌లోనే పూర్తిగా సాధ్యం. కచ్చితంగా వీటికి ఓట్లు పడతాయి. అలాగే రైతుకు ఆదాయం చుట్టూ వ్యవసాయ విధానాలను రూపొందిస్తే ఓట్లు పెరుగుతాయి. ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నికా మార్పు తెస్తుంది. మోదీ పట్ల వ్యతిరేకతపై ఆధారపడటంతప్ప దేశానికి ప్రత్యామ్నాయ దిశానిర్దేశం చేయలేని కాంగ్రెస్ కంటే.. 2019లో కూడా మోదీవైపే ప్రజలు మొగ్గుచూపవచ్చు. కానీ ఈ వాస్తవాల్ని గుర్తించ నిరాకరించి, మాజీ ప్రధానమంత్రిపైన సైతం బాధ్యతారహిత వ్యాఖ్యలు చేసి, భయపెట్టి, వ్యవస్థలను భ్రష్టుపట్టించి గెలుద్దామనుకుంటే ఎల్లకాలం సాగదు. ఇందిర తరహా వ్యక్తి కేంద్రీకృత వ్యవహారశైలికి ఉన్నకొద్దీ పరిమితులు పెరుగుతాయి. సింహాల్ని సింహంలా నడిపించనక్కర్లా, కానీ గొర్రెల్ని గొర్రెలా నడిపించే నాయకత్వాన్ని అందిస్తామంటే ఈ దేశ యువత ఇంకా ఇంకా సహించదు. ప్రజాప్రయోజనాల కోసం కాకున్నా, తమ అధికారం కోసమైనా రాహుల్‌గాంధీ, ఇతర జాతీయ, ప్రాంతీయ పార్టీల నాయకత్వం కూడా గుర్తెరగాల్సిన సురాజ్య సందేశమిది.




# సురాజ్య యాత్ర ఎందుకోసం?

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్

**ఆసక్తి, తపన ఉన్న యువతకి ప్రత్యక్షంగా శిక్షణనిచ్చి ప్రజాస్వామ్య వికాసానికి కొత్తతరం నాయకత్వాన్ని సమకూర్చటం సురాజ్య ఉద్యమ లక్ష్యం. అందులో భాగంగానే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ, పెత్తందారీ సంస్కృతికి ఆస్కారం లేకుండా, ఎవరి పట్టణాల్లో, ఊళ్లల్లో వారు పనిచేసుకునేలా అందిస్తున్న యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్ వెబ్ ప్లాట్‌ఫాంలో పాలుపంచుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.**


స్వతంత్ర భారతదేశం ఇంతకాలం మనగలుగుతుందని తొలినాళ్లలో ఎవరూ అనుకోలేదు. అత్యంత ఎక్కువ జనాభా, అందులో అత్యధికులు నిరుపేదలు, నిరక్షరాస్యులు, ప్రజాస్వామ్యం, స్వపరిపాలనలో అనుభవం లేనివారు, ఇన్ని కులాలు, మతాలు, భాషలు.. వీటి మధ్య భారత్‌లో ప్రజాస్వామ్యం, దేశ ఐక్యత సాధ్యం కాదనుకున్నారు. దేశం ముక్కలైపోతుందనుకున్నారు. ఆ రీత్యా ఆలోచిస్తే మనదేశం గొప్ప విజయం సాధించినట్టే లెక్క. ప్రజాస్వామ్యాన్ని, దేశ ఐక్యతను పరిరక్షించుకుంటూ, శాంతియుతంగా ఎన్నికల్ని నిర్వహించుకుంటూ, అధికారాన్ని శాంతియుతంగా బదిలీ చేస్తూ భారత్ నిలదొక్కుకుంది.

మనదేశంలో ఎన్నికలు పోటాపోటీగా జరుగుతాయి. దేశంలో అందరికీ రాజకీయ, ప్రాథమిక హక్కులు ఉన్నాయి. ఎన్నికైన ప్రభుత్వాలకు నిజమైన అధికారం ఉంది. మనతోపాటు స్వతంత్రం పొందిన పలుదేశాల్లోలా.. ఎన్నికైనవారు ఎన్నిక కానివారిని జైళ్లలో పెట్టటం ఉండదు.

అలాగే స్వతంత్రం వచ్చాక భారత్ రెండు విషయాల్లో చాలా అర్థవంతమైన ప్రగతిని సాధించి ప్రపంచ దేశాలకు మార్గం చూపింది.

ఒకటి) 22 అధికారిక భాషలుండటం. అవి కూడా కోట్లమంది మాట్లాడేవి. శతాబ్దాల తరబడి ప్రత్యేక సంస్కృతి, సాహిత్యం, సంప్రదాయం ఉన్నవి. ఇన్ని భాషల ఉనికిని గుర్తిస్తూ గౌరవిస్తూ దేశ ఐక్యతకు భంగం లేకుండా మన రాజకీయ పార్టీలు, నాయకత్వం చాలా దూరదృష్టిని, విజ్ఞతను ప్రదర్శించాయి. శ్రీలంక, పాకిస్తాన్ దేశాల్లో భాష మూలంగా తలెత్తిన పరిస్థితుల్ని చూస్తే.. మనం సాధించిన విజయం ఎంత అద్భుతమైనదో అర్థమవుతుంది.

రెండవది) కేంద్రీకృత ప్రజాస్వామ్యంగా ప్రారంభమైన దేశం




గత 30 ఏళ్లుగా నిజమైన ఫెడరల్ ప్రజాస్వామ్యంగా బలపడింది. రాష్ట్రాలకు అధికారాలు, వనరులు, వెసులుబాటు గణనీయంగా పెరిగాయి. రెండవ ప్రపంచయుద్ధం తర్వాత కొత్తగా, బలమైన, నిజమైన ఫెడరల్ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్న ఏకైక దేశం భారత్.

**ఇన్ని విజయాల్ని సాధించినా కీలక వైఫల్యాలు**

ఇన్ని విజయాలు సాధించినా.. ప్రజల జీవనప్రమాణాలను పెంచటంలోనూ, బీదరికాన్ని తొలగించటంలోనూ, ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేయటంలోనూ, అందరికీ ఎదిగే అవకాశాలను కల్పించటంలోనూ మనదేశం మిగతా ప్రపంచంతో పోలిస్తే చాలా వెనుకబడి ఉంది. ప్రపంచంలో జాతీయాదాయం 200 బిలియన్ డాలర్లు దాటిన దేశాలు 49 ఉండగా, వాటిల్లో దాదాపు ప్రతి కీలకమైన రంగంలోనూ.. ఉదాహరణకు విద్యుత్తు, రవాణా, మంచినీరు, పారిశుద్ధ్యం, ఇతర ఉమ్మడి వసతులు, పాఠశాల విద్యాప్రమాణాలు, ఆరోగ్యం.. దాదాపు అన్నింటిలో పాకిస్తాన్, బంగ్లాదేశ్, నైజీరియాతోపాటు భారతదేశం అట్టడుగు స్థాయిలో ఉంది.

అలాగే 1947లో జపాన్ తరువాత అత్యున్నత అభివృద్ధిని సాధించిన ఆసియా ఖండంలోని దేశాలలో భారత్ ఒకటి. కానీ ఇప్పుడు పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల సరసన ఆసియా ఖండంలో చిట్టచివరన ఉన్న దేశాలలో భారత్ ఒకటి.

ప్రజాస్వామ్యం చూడ్డానికి బాగానే నడుస్తున్నా మనదేశంలో ఇంతటి తీవ్రమైన వైఫల్యాల వెనకాల బలమైన కారణాలున్నాయి. ఒక ప్రజాస్వామ్యం సత్ఫలితాలనివ్వడానికి నాలుగు పునాదులు భారత్‌లో లోపించాయి.

**1) జవాబుదారీతనంలేని ప్రభుత్వోద్యోగ వ్యవస్థ:**

ప్రభుత్వోద్యోగులు పన్నులు కట్టే ప్రజలకి జవాబుదారీగా ఉండి పౌరులకి సకాలంలో లంచాలు లేకుండా సేవలందించే జవాబుదారీతనం ఉండాలి. కానీ మనదేశంలో నేటికీ 90శాతం మంది సామాన్య ప్రజలు ప్రభుత్వంలో ఉన్న ఓ చిరుద్యోగి కంటే ఆర్థికంగానూ, పలుకుబడిరీత్యానూ అనేకరెట్లు బలహీనుడు. దాంతో ఓటు వేసి పన్నుల్ని కట్టే పౌరురాలు/పౌరుడు ప్రభుత్వ యంత్రాంగం ముందు దేహీ అని అర్థించాల్సి వస్తోంది. రాజకీయ యంత్రాంగం మొత్తం ప్రజలకు–ప్రభుత్వోద్యోగులకు మధ్య మధ్యవర్తిత్వానికి పరిమితమైంది.

**2) పౌరసత్వ భావన, పన్నులు కడుతున్నామన్న స్పృహ పెరగకపోవటం:**

ప్రజల్లో పౌరసత్వ భావన, తాము పన్నులు కడుతున్నామన్న స్పృహ, ప్రభుత్వం మన పన్నుల డబ్బుతో ఏం చేయాలో స్పష్టమైన అవగాహన, ప్రభుత్వ వ్యవస్థను గూర్చి కాస్తయినా పరిచయం.. ఇవి ప్రజాస్వామ్య మనుగడకు అవసరం. కానీ మనదేశంలో ఇప్పటికీ ప్రజల దృష్టిలో ఎన్నికైనవాడు రాజు. అధికారంలో కూర్చున్నవాడు ప్రభువు. మన ఓటు ద్వారా వాళ్లకి ఈ అధికారం వస్తుందనుకునే మార్పు తప్ప.. ప్రజల దృష్టిలో రాచరికపు పాలనకి, వలస పాలనకి, ప్రజాస్వామ్య పాలనకి మధ్య తేడా లేదు. పౌరులు అర్థించే ప్రజలుగానూ, పదవుల్లో కూర్చున్న వాళ్లు వరాలిచ్చే దాతలుగానూ, ఏదోకరకంగా అద్భుతాలు సాధించే హీరోలుగానూ చెలామణి అవుతున్నారు. అప్పుడు ప్రజాస్వామ్యం కేవలం ఓటు వేయటానికి, నిరసన తెలపటానికి మాత్రమే పనికొస్తుంది.

**3) స్థానిక ప్రభుత్వాలను నిర్వీర్యం చేయటం:**

అధికారం, వనరులు వీలున్నంత వరకు జనానికి చేరువగా ఉంటే, స్థానిక ప్రభుత్వాలకు నిజమైన స్వయంప్రతిపత్తి ఉండి ఉంటే.. ప్రజలకు తాము కట్టే పన్నులకు – తమకు జరిగే పనులకు మధ్య సంబంధం అర్థమయ్యే వ్యవస్థ ఏర్పడేది. తాము వేసే ఓటుకి – పాలన వల్ల వచ్చే ఫలితాలకు మధ్య సంబంధం అర్థమవ్వాలంటే, నిజమైన జవాబుదారీతనంతో ప్రజలకు సేవలందాలంటే ఇది అవసరం. కానీ మనదేశంలో అధికారాన్ని కేంద్రీకృతం చేసి స్థానిక ప్రభుత్వాలను నామమాత్రం చేశాం. 1960వ దశకంలో స్థానిక ప్రభుత్వాలకు కొంత పాత్ర

కల్పించినా, ఆ తర్వాత వాటిని పూర్తిగా నిర్వీర్యం చేశాం. దాంతో పౌరుడికి తన ఓటుకి-తన జీవితంలో రోజువారీ ఫలితాలకి మధ్య సంబంధం అర్థం కాకుండా పోయింది. సమర్థమైన నాయకత్వం ప్రజల నుంచి పెరిగే అవకాశం లేకుండా పోయింది. ప్రభుత్వ విధానాలు ప్రజల జీవనప్రమాణాలను పెంచటం కోసం కాకుండా.. అయితే పెద్దఎత్తున అవినీతిని కొనసాగించటానికి, లేదా తాత్కాలిక తాయిలాలిచ్చి ఓటర్లను మచ్చిక చేసుకోవటానికి, లేదా కులం, మతం, ప్రాంతం విభేదాలు రెచ్చగొట్టి ప్రజలను ఓటుబ్యాంకులుగా మార్చటానికి మాత్రమే ఉపయోగపడ్డాయి.

**4) చట్టబద్ధపాలన/ మహిళలకు భద్రత:**

చట్టం నిజంగా అందరికీ సమానంగా వర్తిస్తే, తరతమ భేదాలు లేకుండా అందరి హక్కులనూ సమానంగా కాపాడగలిగితే, ఎన్నికైన వాళ్లు పదవుల్లో ఉన్నవాళ్లు తప్పులు చేస్తే మూల్యం చెల్లించి శిక్ష పడుతుందన్న భయం ఉంటే ఆ ప్రజాస్వామ్యం బలోపేతమై, దాని వల్ల ప్రజలకు మంచి ఫలితాలనిచ్చే అవకాశాలు వచ్చేవి. కానీ మనదేశంలో చట్టబద్ధ పాలన కేవలం కాగితాలకే పరిమితమై ఉంది. రాజ్యాంగం కల్పించే సమాన హక్కులుగానీ, చట్టం ద్వారా వచ్చే రక్షణగానీ.. పలుకుబడి, డబ్బు, చదువు లేని కోట్లాదిమంది సామాన్యులకు అందటం లేదు. జనాభాలో సగభాగమున్న మహిళలపై దైనందిన జీవితంలో వేధింపులు పెనుసమస్యగా కొనసాగుతున్నాయి. దీంతో అధికారంలో ఉన్నవారు ప్రజలకు జవాబుదారీగా ఉండే అవకాశం లేకుండా పోయింది. ఎన్నికల్లో ఓడిపోతామన్న భయం కొద్దీ ప్రజల్ని మచ్చిక చేసుకోవటం కోసం తాత్కాలిక తాయిలాల్ని అందించటం తప్ప నిజమైన జవాబుదారీతనాన్ని మనం వ్యవస్థలో నెలకొల్పలేకపోయాం.

సురాజ్య యాత్ర ఈ వైఫల్యాలను సవరించటం కోసం, ప్రజాస్వామ్యాన్ని గాడిన పెట్టటం కోసం, ఆలస్యంగానైనా బలమైన పునాదుల్ని నిర్మించటం కోసం చేపట్టిన ఉద్యమం. ఈ ఉద్యమ లక్ష్యాలు నిర్దిష్టమైనవి, సులభంగా అమలు చేయగలిగినవి, ప్రస్తుతం ప్రభుత్వం ఖర్చు పెడుతున్న నిధులతోనే అదనపు వనరుల అవసరం లేకుండానే సాధించగలిగినవి, సమాజంలో అన్ని వర్గాలూ అంగీకరించేవి, మన ప్రజాస్వామ్య పునాదుల్లో ఉన్న బలహీనతల్ని సరిచేయటంతోపాటు సామాన్య ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేవి.

**లోతైన అవగాహనతో రూపొందించిన ఆచరణ సాధ్యమైన 6 లక్ష్యాల కోసం సురాజ్య ఉద్యమాన్ని చేపట్టటమైంది.**

1) ప్రభుత్వ ఆఫీసుల్లో లంచాలు, వేధింపులు, దేబిరింపులు లేకుండా హక్కుగా ప్రజలకు సేవలు

2) పుట్టిన ప్రతి బిడ్డకీ ఆ కుటుంబం ఖర్చు పెట్టకుండా అత్యున్నత ప్రమాణాల పాఠశాల విద్యను అందించి పౌరులందరికీ ఎదిగే అవకాశం ఇవ్వటం

3) ప్రతి వ్యక్తికీ అత్యున్నత ప్రమాణాల ఆరోగ్యాన్ని ప్రాథమిక స్థాయి నుంచి ఆధునిక ఆస్పత్రుల దాకా ఆ కుటుంబానికి ఏమాత్రం భారం లేకుండా అందించటం

4) కేంద్రం నుంచి రాష్ట్రానికి 50శాతం మేర వనరులు పంపిణీ అవుతున్న రీతిన స్థానిక ప్రభుత్వాలకి, ముఖ్యంగా చిన్న పట్టణాలకి 50శాతం వనరులు పంపిణీ అయి ఎక్కడికక్కడ ప్రజల అవసరాల్ని తీర్చే ఏర్పాట్లు చేయటం

5) పెరుగుతున్న నగరీకరణతో సామాన్య ప్రజల హక్కుల్ని కాపాడటం కోసం, మహిళలకు రోజువారీ జీవితంలో భద్రతను అందించటం కోసం నేరానికి శిక్ష పడి న్యాయం అందుతుందన్న విశ్వాసం కల్పించటం కోసం స్థానిక న్యాయాలయాలను గ్రామాల్లో, పట్టణాల్లో ఏర్పాటు చేయటం

6) రైతుల ఉత్పత్తికి మంచి ధర పలికే విధానాన్ని చేపట్టి వ్యవసాయాన్ని- చిన్న పట్టణాల్ని అనుసంధానించి స్థానికంగా ఉపాధి కల్పించి గ్రామీణ, వ్యవసాయ రంగాల్లో పెరుగుతున్న సంక్షోభాన్ని నివారించటం

**వీరి భాగస్వామ్యంతో నిర్మాణాత్మక పోరాటం లక్ష్యం**

యువత, మధ్యతరగతి, మహిళలు, రైతులు, అందరినీ మించి దుష్పరిపాలన మూలంగా నష్టపోతున్న అణగారినవర్గాలను చైతన్యవంతం చేయటం, ప్రధానంగా విద్యార్థులు, యువతను ఉద్యమంలో భాగస్వాముల్ని చేయటం, నిర్దిష్టమైన క్షేత్రస్థాయి కార్యాచరణలో ఈ 6 లక్ష్యాల అమలు కోసం నిర్మాణాత్మక పోరాటం చేయటం.. సురాజ్య ఉద్యమ ప్రధాన లక్ష్యం.

**కొత్తతరం నాయకత్వాన్ని సమకూర్చటం కోసం శిక్షణ**

దీంతోపాటు ఆసక్తి, తపన ఉన్న యువతకి ప్రత్యక్షంగా శిక్షణనిచ్చి ప్రజాస్వామ్య వికాసానికి కొత్తతరం నాయకత్వాన్ని సమకూర్చటం సురాజ్య ఉద్యమ లక్ష్యం. అందులో భాగంగానే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ, పెత్తందారీ సంస్కృతికి ఆస్కారం లేకుండా, ఎవరి పట్టణాల్లో, ఊళ్లల్లో వారు పనిచేసుకునేలా అందిస్తున్న యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్ వెబ్ ప్లాట్‌ఫారాలలో పాలుపంచుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

Join & Participate:
www.youthforbetterindia.com □




# సురాజ్య పరిష్కారాలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి జేపీ బృందం ప్రజంటేషన్

'జనం కోసం జేపీ' సురాజ్య యాత్ర ఆంధ్రప్రదేశ్‌లో పూర్తయిన సందర్భంగా.. రాష్ట్రవ్యాప్తంగా యాత్రలో బైటపడ్డ సమస్యలను, పరిష్కారాలను లోక్‌సత్తా వ్యవస్థాపకుడు, ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) ప్రధాన కార్యదర్శి డా॥ జయప్రకాష్ నారాయణ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును డిసెంబర్ 14న అమరావతిలో కలిసి వివరించారు. లిఖితపూర్వక గ్రాఫిక్ ప్రజంటేషన్‌ని కూడా ఇచ్చారు.

పార్టీలకతీతంగా సెప్టెంబర్ 15, 2017న విశాఖపట్నం జిల్లాలో సురాజ్య యాత్రను ప్రారంభించి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో విద్యార్థులు–యువత, మధ్యతరగతి, దళితులు–పేదలు, రైతులతో ఆరు లక్ష్యాలపై చర్చిస్తూ వారి అభిప్రాయాలను కూడా కలుపుకుని ఈ ప్రజంటేషన్‌ను రూపొందించినట్టు జేపీ తెలిపారు. ఇందులో సురాజ్య యాత్ర లక్ష్యాలకు సంబంధించిన పూర్వాపరాల్ని కూడా గణాంకాలు, హేతుబద్ధ వాదనలతో పొందుపరిచారు.

సురాజ్య యాత్ర ఆరు లక్ష్యాలైన "1) ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా పౌర సేవలు 2) పాఠశాల విద్య – ప్రతి బిడ్డకి ఖర్చు లేకుండా మంచి ప్రమాణాల విద్య 3) ఆరోగ్య రంగం – ప్రతి కుటుంబానికి ఖర్చు లేకుండా అన్ని స్థాయిలలో మంచి ఆరోగ్యం 4) స్థానిక ప్రభుత్వాలు – పన్నుల్లో వాటా 5) చట్టబద్ధ పాలన – మహిళల రక్షణ 6) పంటల ధరల సంక్షోభం – లాభసాటి వ్యవసాయం" చుట్టూ ఈ సమస్యలను గుర్తించామని, ఈ పరిష్కారాలన్నీ సులభమైనవి, తేలిగ్గా అమలుచేయగలిగినవి, ఎవరికీ అభ్యంతరం లేనివి, దాదాపు ఖర్చు లేనివి, జనం జీవితాల్లో మాత్రం పెద్ద మేలి మార్పుని తేగలిగినవి అని ముఖ్యమంత్రికి జేపీ వివరించారు.


**సురాజ్య బృందంతో కలిసి ఏపీ ముఖ్యమంత్రికి జేపీ ఇచ్చిన ప్రజంటేషన్ స్థూలంగా..**

### 1) ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా సేవలందించేందుకు 'పౌర సేవల' (సర్వీస్ గ్యారంటీ) చట్టం తేవటం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే ఒక చట్టాన్ని అమలు చేస్తోంది (లోక్‌సత్తా పంపిన నమూనా చట్టానికి అనుగుణంగానే దీన్ని రూపొందించారు). అయితే ఇది సులభతర వ్యాపారానికి సంబంధించిన సేవలకే వర్తిస్తోంది. కోట్లాది సామాన్య ప్రజలు పొందే సేవలకు కూడా ఇలా హక్కుగా సేవలందించేందుకు పౌర సేవల చట్టాన్ని తేవాలి.

■ ప్రజల రోజువారీ పనుల్లో నాణ్యమైన సేవల్ని ప్రభుత్వం అందించేందుకు కార్యాలయాల్లో ఏర్పాట్లను బలోపేతం చేయాలి. ■ ఇలాంటి సేవలను అందించేందుకు 'అవసరమైన చోట్ల' కొంత ఫీజును పెంచవచ్చు. ■ ప్రతి కార్యాలయంలో పనులకు నిర్ణీత గడువుతో సిటిజన్ ఛార్టర్లు, గడువులోగా పని చేయలేకపోతే దరఖాస్తుదారునికి ప్రతిరోజూ ఆలస్యానికి పరిహారం ఉండాలి. ■ నెలవారీ నివేదికలు విభాగాలవారీగా అందాలి ■ సకాలంలో సేవలందించటం కోర్ డ్యాష్‌బోర్డుతో సంధానం చేయాలి. ■ మొత్తం పర్యవేక్షణను లోకాయుక్త పరిధిలోకి తేవాలి.

**2) స్కూలు విద్య**




**■ నిధులు విద్యార్థుల చుట్టూ తిరగాలి ■ సీసీఈ (కంటిన్యుయస్ అండ్ కాంప్రహెన్సివ్ ఎవాల్యుయేషన్)ను వ్యవస్థీకృతం చేయటం ■ 'శాట్' తరహా పరీక్ష ■ స్కూళ్ల హేతుబద్ధీకరణ ■ పరిమిత ఫీజున్న మెరుగైన ప్రైవేటు స్కూళ్లలో రీఇంబర్స్‌మెంట్**

**లక్ష్యం:** తల్లిదండ్రుల మీద ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన ఫలితాలనిచ్చే చదువునందించటం పాఠశాల విద్య లక్ష్యం కావాలి.

**ప్రస్తుత పరిస్థితి :** ప్రస్తుతం ప్రభుత్వ స్కూళ్లలో 2,20,000 మంది టీచర్లు పనిచేస్తున్నారు. 38 లక్షలమంది విద్యార్థులున్నారు. ఏడాదికి సగటున ఒక్కో విద్యార్థి మీద రూ.50,000-60,000 ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. కానీ అధ్వాన్నమైన చదువు అందుతోంది. దీంతో పేదపిల్లలు కూడా సర్కారీ బడుల నుంచి ప్రైవేటు స్కూళ్లలోకి ఫీజు కట్టి చేరుతున్నారు.

### పశ్చిమ గోదావరి జిల్లా ఉదాహరణ

రాష్ట్రంలోని 50శాతం ప్రాథమిక పాఠశాలల్లో 30 కంటే తక్కువమంది పిల్లలున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో పరిస్థితినే తీసుకుంటే.. ఐదుగురు కంటే తక్కువమంది పిల్లలున్న స్కూళ్లు 47 ఉన్నాయి. ఇలా అహేతుకమైన పాఠశాలలు 2394 ఉన్నాయని అంచనా. అలాగే 850 స్కూళ్లు తగినంతమంది విద్యార్థులతో నడుస్తున్నాయి.

### ప్రభుత్వ స్కూళ్లలో తగ్గుతున్న ఎన్‌రోల్‌మెంట్లు, ప్రైవేటులో పెరుగుదల

1 నుంచి 8వ తరగతి వరకు ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల చేరిక ఉన్నకొద్దీ తగ్గుతూ.. ప్రైవేటు పాఠశాలల్లో పెరుగుతోంది. 2008-2016 కాలంలో దాదాపు 5లక్షలమంది ఈ తరగతుల పిల్లలు ప్రభుత్వ స్కూళ్ల నుంచి ప్రైవేటు బడుల్లోకి తరలిపోయారని అంచనా.

### అధ్వాన్న చదువులపై 'అసర్' వరస నివేదికలు

గ్రామీణ ప్రాంతంలో పాఠశాల విద్యా స్థితిగతులపై 2007 నుంచి 2016 వరకు రూపొందించిన నివేదికలు (అసర్) విద్యార్థుల పరిజ్ఞానం ఎంత అధ్వాన్నంగా ఉందో స్పష్టంగా తెలియచేస్తున్నాయి. 2010లో మూడవ తరగతి విద్యార్థుల్లో తీసివేత చేయగలిగినవారు ప్రభుత్వ స్కూళ్లలో 38.8శాతం ఉంటే, ప్రైవేటులో 66.8శాతం ఉన్నారు. ఈ సంఖ్యలు 2012లో 46.3, 67.1, 2014లో 31.4, 57.8, 2016లో 38.8, 62.8గా ఉన్నాయి.

అలాగే భాగాహారం చేయగల పిల్లలు 8వ తరగతిలో ప్రభుత్వ స్కూళ్లలో 2010లో 68.4శాతం ఉంటే, ప్రైవేటులో 77.8శాతం

ఉన్నారు. ఈ అంకెలు 2012లో 65.0, 80.5, 2014లో 53.0, 65.7, 2016లో 41.2, 76.9గా ఉన్నాయి.

రెండవ తరగతి పుస్తకంలోని ఓ పేరాని చదవగలవాళ్లు ఐదవ తరగతిలో 2010లో ప్రభుత్వ పాఠశాలల్లో 58.9శాతం ఉంటే, ప్రైవేటు స్కూళ్లలో 65.9 శాతం ఉన్నారు. ఈ సంఖ్యలు 2012లో 64.0, 58.8, 2014లో 57.0, 58.2, 2016లో 52.4, 60.6గా ఉన్నాయి.

**పరిష్కారంగా ఏం చేయాలి?**

- 60మంది కంటే తక్కువ విద్యార్థులున్న స్కూళ్లను (మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఉన్నవి మినహాయించి) హేతుబద్ధీకరించాలి.
- సీసీఈ (కంటిన్యుయస్ అండ్ కాంప్రహెన్సివ్ ఎవాల్యుయేషన్)ని పూర్తిగా వ్యవస్థాగతం చేయాలి.
- 5, 7, 10 తరగతులకు 'శాట్' తరహా పరీక్షను నిర్వహించాలి.
- పరీక్షలు, మూల్యాంకనాలను సమన్వయపరచాలి.
- మూల్యాంకనానికి, ర్యాండమ్ పరీక్షకు రాష్ట్రస్థాయి టెస్టింగ్ బోర్డును ఏర్పాటు చేయాలి. తనిఖీ, పర్యవేక్షణ, ఈ-లెర్నింగ్‌కు 5శాతం ఉపాధ్యాయులను తిరిగి కేటాయించాలి.

**రూ.10,000లోపు ఫీజుతో ఉన్న మెరుగైన ప్రైవేటు స్కూళ్లలో విద్యార్థులకు రీఇంబర్స్‌మెంట్**

2015-16 లెక్కప్రకారం 43.5శాతం మంది పిల్లలు (1 నుంచి 8వ తరగతి వరకు) ఆంధ్రప్రదేశ్‌లో ప్రైవేటు స్కూళ్లలో ఉన్నారు. వీరిలో చాలామంది తల్లిదండ్రులు పేదలు. ఏడాదికి రూ.5,000 నుంచి 10,000 వరకు స్కూలు ఫీజు కడుతున్నారు. చాలా ప్రైవేటు స్కూళ్లలో కూడా విద్యాప్రమాణాలు నాసిరకంగానే ఉన్నాయి. ప్రైవేటు స్కూళ్లలో చదువుపైనా ప్రభుత్వం దృష్టి పెట్టాలి. నాణ్యమైన చదువు అందేలా చేయాలి. ఏడాదికి రూ.10,000 లోపు ఛార్జి చేస్తూ మంచి చదువును అందించే ప్రైవేటు స్కూళ్లలో చదివే విద్యార్థులకు ఫీజును ప్రభుత్వం పూర్తిగా రీఇంబర్స్ చేయాలి. దీనివల్ల ప్రైవేటు స్కూళ్లలో ఉన్న 30లక్షల మంది విద్యార్థుల్లో 15 లక్షలమందికి లాభం చేకూరుతుంది.

**నిధులు విద్యార్థుల చుట్టూ తిరగాలి**

పాఠశాల విద్యకు కేటాయిస్తున్న నిధులు ఉపాధ్యాయుల చుట్టూ కాకుండా విద్యార్థుల చుట్టూ తిరగాలి. పరిమిత ఫీజుతో మంచి ప్రమాణాల చదువు అందించే ప్రైవేటు స్కూళ్లలో చదివే విద్యార్థులకు ఫీజు రీఇంబర్స్ చేస్తే అదనపు భారం లేకుండా నాలుగేళ్లలో దాదాపు 15 లక్షలమందికి మేలు జరుగుతుంది.

## 3) వైద్యం, ఆరోగ్యం

- **వ్యయాన్ని 0.27శాతం మేర పెంచటం, నిర్దిష్ట అంశాలకే పెంచిన నిధుల వినియోగం**
- **ప్రజలకు ఎంచుకునే స్వేచ్ఛనిస్తూ ఎంబీబీఎస్ డాక్టర్లతో**

**ప్రాథమిక వైద్యసేవలకు ఫ్యామిలీ డాక్టర్ల నెట్‌వర్క్ వ్యవస్థ**

**కొన్ని మంచి పరిణామాలకు దోహదం చేసిన చర్యలు**

అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులకు మందుల సరఫరాలను కేంద్రీకృత పర్యవేక్షణలోకి తేవటం, పారిశుధ్య పనుల్ని ఔట్‌సోర్సింగ్ చేయటం, ఎన్టీఆర్ వైద్యపరీక్ష, 60 సేవలకు కొత్తగా ఏర్పాటు చేసిన 103 ల్యాబ్‌ల ద్వారా ప్రధాన వైద్యపరీక్ష సేవల్ని ఉచితం చేయటం వంటివి ఏపీ వైద్యవిధానంలో మంచి పరిణామాలకు దోహదం చేశాయి. కానీ చేయాల్సిన మార్పుతో పోలిస్తే ఇవి చాలా చిన్నవి.

**కేంద్ర బిల్లును విజ్ఞతతో పక్కన పెట్టిన ఏపీ,**

**రాష్ట్రానికి తగురీతిలో ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా బిల్లు**

అలాగే కేంద్రం రూపొందించిన క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం (సీఈఏ)లో ఉన్న లోపాల రీత్యా ఆ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం పక్కనపెట్టింది.

సంబంధిత మంత్రిత్వశాఖ విజ్ఞప్తి మేరకు.. ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా మెరుగైన సీఈఏ బిల్లును రూపొందించి ఆంధ్రప్రదేశ్

## SOLUTION
### *Strengthen Primary Care Services*

- **Establish Primary Care Networks In 500 Towns:**
  - Network of 10 doctors to provide primary care for 70,000-100,000 population.
  - People register their families with one of the **doctor of their choice** in the network.
  - Network doctors will be remunerated on per capita basis for their registered persons (Rs. 400/capita/year).

    **1500 families registered/doctor or 6000 persons/doctor**

    **Rs. 24 lakhs/year or Rs. 2 lakhs/month**
  - 1 month onboarding training on family care for doctors.
  - Contracted doctors to establish a clinic and hire support staff to assist in care delivery.
  - Population can seek care from government hospitals only on referral, except in case of emergencies.

| SERVICES PROVIDED |
|---|
| Family care and outpatient care |
| MCH care (except deliveries) |
| Monitor NCDs |
| Simple lab tests |
| Dispensing drugs supplied by government |
| Hospital recordkeeping |

ప్రభుత్వానికి అందించింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ రంగంలోని వారందరినీ సంప్రదించి రాష్ట్ర అవసరాలకనుగుణంగా ఈ చట్టాన్ని తయారుచేయటమైనది. దీనివల్ల ఆస్పత్రి సేవలను సక్రమంగా ప్రజోపకరంగా నియంత్రించే అవకాశం ఏపీ ప్రభుత్వానికి లభిస్తుంది.

### నిధులకు అనేకరెట్లు సేవలు

ప్రభుత్వ ఆరోగ్యరంగంలో నిధులు తక్కువ, సేవలు మాత్రం అనేకరెట్లు ఎక్కువగా ఉండటాన్ని బట్టి.. ఈ రంగానికి నిధులిస్తే చాలామేర ప్రజల ఆరోగ్య సమస్యలకు చౌక పరిష్కారం లభించే అవకాశముందని స్పష్టమవుతోంది.

- ఒక్కో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై ప్రభుత్వం ఏడాదికి రూ. 70లక్షలు ఖర్చు చేస్తోంది.
- మైదానప్రాంతాల్లో ఒక్కో పీహెచ్‌సీ 60,000మందిని కవర్ చేస్తోంది. అదే ప్రభుత్వ హైస్కూలును తీసుకుంటే.. 11,520మంది జనాభాను కవర్ చేస్తుంటే, దీనికి రూ. 1.8కోట్లు వెచ్చిస్తోంది.
- కమ్యూనిటీ హెల్త్ సెంటర్ విషయానికొస్తే, చిలకలూరిపేటనే ఉదాహరణగా తీసుకుంటే ఇక్కడ ప్రభుత్వం 1.3 - 1.4 కోట్లు ఖర్చు చేస్తోంది. కానీ ఇక్కడ అందిస్తున్న సేవల విలువ రూ. 5-8కోట్లుగా ఉంది.
- అలాగే ఏరియా ఆస్పత్రుల్లో పార్వతీపురాన్ని తీసుకుంటే.. ఇక్కడ ఇన్‌పేషెంట్లు 200-220 వరకు ఉన్నారు (అధికారికంగా ఉన్న పడకలు 100 మాత్రమే). ఔట్‌పేషెంట్లు రోజుకు 1500-2000 దాకా వస్తున్నారు. ప్రభుత్వం ఇక్కడ పెడుతున్న ఖర్చు ఏడాదికి రూ. 5కోట్లుకాగా, ఇక్కడ అందిస్తున్న సేవల విలువ దాదాపు రూ. 50కోట్లు దాకా ఉంటుంది.
- బోధనాస్పత్రుల్లో ప్రభుత్వ ఖర్చు ఏడాదికి రూ. 60-70కోట్లు ఉండగా, సేవలు రూ. 300-400కోట్లు దాకా అందుతున్నాయని అంచనా.

బలహీనమైన ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ, రోగులతో కిటకిటలాడే, నిధులకు కటకటలాడే ప్రభుత్వాస్పత్రులు, తగినంత జీతభత్యాలు లేని వైద్యసిబ్బంది.. వైద్య ఆరోగ్య రంగంలో ప్రధాన సవాళ్లుగా ఉన్నాయి.

### రెండు పరిష్కారాలు

వైద్య రంగానికి వ్యయాన్ని ఆచరణసాధ్యంగానే కొంత పెంచటం, ప్రాథమిక ఆరోగ్య సేవా నెట్‌వర్క్‌ని పటిష్టంగా ఏర్పాటు చేయటం పరిష్కారాలు.

ఒకటి) ఈ వ్యయాన్ని కూడా ఒకేసారి పెంచనక్కర్లేదు. ఏడాదికి రూ. 3లక్షలు చొప్పున ఒక్కో పడకకు రెండేళ్ల చొప్పున పెంచితే చాలు. ఈ డబ్బును..

- డాక్టర్లు, నర్సులు, ఏఎన్ఎంలు తదితర వైద్యసిబ్బందికి మెరుగైన జీతాలివ్వడానికి
- మెరుగైన పరికరాల (ఎక్స్-రే యంత్రాలు, ల్యాబ్ పరికరాలు వగైరాలు)కి
- మెరుగైన మౌలిక వసతులు, అవసరమైన చోట అదనపు బెడ్‌లకు

- రక్తనిధుల ఏర్పాటు (అవసరాన్ని బట్టి)కు
- మందుల సరఫరా పెంచటం (అవసరాన్ని బట్టి) కోసం వినియోగించాలి. ప్రస్తుతం స్పెషలిస్టు డాక్టర్‌కి నియామక సమయంలో రూ. 45,000 జీతం అందుతుండగా, నర్సులకు రూ. 16,000 మాత్రం నెలజీతం. నర్సులకు మెటర్నిటీ లీవు, హెల్త్ ఇన్సూరెన్స్ కూడా లేవు. కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు నెలకు రూ. 12,000 ఇస్తున్నారు. వీరికి కూడా మెటర్నిటీ లీవులు, ఆరోగ్య బీమా లేవు. సీనియర్ రెసిడెంట్ల (కంపల్సరీ సర్వీసులో ఉన్న స్పెషలిస్టు డాక్టర్లు)కు నెలకు రూ. 33,000 ఇస్తున్నారు. ఈ చెల్లింపుల్ని కూడా నెలలు, సంవత్సరాల తరబడి జాప్యం చేస్తుంటారు.

రెండవది) 500 పట్టణాల్లో ప్రాథమిక వైద్య సేవల నెట్‌వర్క్‌ని ఏర్పాటు చేయాలి:

- 70,000 నుంచి 1,00,000 జనాభాకు ప్రాథమిక వైద్యాన్ని అందించటానికి 10మంది డాక్టర్లతో నెట్‌వర్క్‌ని ఏర్పాటు చేయాలి.
- ప్రజలు తమ కుటుంబసభ్యుల పేర్లను నెట్‌వర్క్‌లో 'తమకు నచ్చిన' డాక్టర్ వద్ద రిజిస్టర్ చేసుకుంటారు. వీరు ప్రజలకు ఉచిత వైద్యాన్ని అందిస్తారు.
- ఎంతమంది రిజిస్టర్ చేసుకుంటారో అంతమంది పేరున తలసరి చెల్లింపుల్ని డాక్టర్‌కి ప్రభుత్వం చేయాలి (ఉదాహరణకు ఏడాదికి ఒక్కొక్కరి పేరు మీద రూ. 400). ఇలా 1500 కుటుంబాలు నమోదైతే, ఆ డాక్టర్ వద్ద సుమారు 6000మంది ప్రజలు రిజిస్టర్ అయినట్టు. అంటే డాక్టర్‌కి రూ. 24 లక్షలు ఏడాదికి వస్తాయి. నెలకు రూ. 2లక్షలన్నమాట.
- ఫ్యామిలీ కేర్ సేవలపై డాక్టర్లకు 1 నెలరోజుల పాటు శిక్షణనందించాలి.
- ఇలా ఒప్పందం కుదుర్చుకున్న వైద్యులు క్లినిక్‌ను ఏర్పాటు చేసుకుని తమకు కావలసిన సహాయ వైద్యబృందాన్ని ఏర్పాటు చేసుకుంటారు.
- ప్రజలు తాము రిజిస్టర్ చేసుకున్న ఫ్యామిలీ డాక్టర్ వద్ద ఉచిత సేవలు పొందుతారు. పైస్థాయి ఆస్పత్రుల్లో ఉచితంగా సేవలు పొందాలంటే ఫ్యామిలీ డాక్టర్ రిఫర్ చేయాల్సి ఉంటుంది. ఎమర్జెన్సీ కేసులకు మాత్రం మినహాయింపు ఉంటుంది.

**0.27శాతం అదనపు నిధులు అవసరం**

వైద్యరంగాన్ని ఈ మార్పుల్ని తెచ్చి ప్రజలందరికీ ఖర్చు లేకుండా మెరుగైన వైద్యాన్ని అందించటానికి అదనంగా రూ. 2,000 కోట్లు మాత్రమే ఖర్చవుతాయి. ఇది ఏపీ జీఎస్‌డీపీలో కేవలం 0.27శాతం మాత్రమే. కానీ వచ్చే లాభం మాత్రం అనేకరెట్లు ఎక్కువగా ఉంటుంది.

**ఈ పెంపులో..**

- ప్రాథమిక వైద్యసేవల నెట్‌వర్క్ ఏర్పాటుకు రూ. 1700కోట్లు (3కోట్లమంది రిజిస్టర్డ్ జనాభా ఉంటారనుకుంటే, తలసరి రూ. 400 చొప్పున)
- ప్రాథమిక వైద్యసేవలకు ఇప్పుడున్న సిబ్బంది జీతాలు పెంచటానికి రూ. 100కోట్లు
- ఏడాదికి రూ. 3లక్షల చొప్పున రాష్ట్రంలోని ఆస్పత్రి పడకలకు కేటాయింపులు పెంచటానికి రూ. 600 కోట్లు ఖర్చవుతాయి.

**4) స్థానిక కోర్టులు (మహిళల భద్రతకు ప్రాధాన్యత)**

స్థానిక కోర్టులు లేదా గ్రామ న్యాయాలయాలు వేగంగా, చాలా తక్కువ ఖర్చుతో, ముఖ్యంగా మహిళలపై నేరాలకు సంబంధించిన కేసుల్ని పరిష్కరిస్తాయి.

- గ్రామ న్యాయాలయాల చట్టం 2009లో పార్లమెంటు ఆమోదంతో అమల్లోకి వచ్చింది.
- గ్రామీణ కోర్టుల ఏర్పాటుకు, న్యాయవ్యవస్థలో మౌలిక వసతుల పెంపునకు మార్చి 2017లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ. 33కోట్లు విడుదల చేసింది.
- అయితే ఇప్పటిదాకా కోర్టులు ఏర్పాటు కాలేదు.
- మహిళలపై ఈవ్‌టీజింగ్, స్టాకింగ్ వంటి వేధింపుల కేసులను చేరుస్తూ, పట్టణ ప్రాంతాలకు విస్తరిస్తూ స్థానిక కోర్టుల చట్టాన్ని సవరించాలి.

- స్థానిక కోర్టుల చట్టాన్ని తేవడంలో కీలకపాత్ర పోషించిన లోక్‌సత్తా.. సవరణల బిల్లును కూడా సిద్ధం చేసింది.
- ప్రతి మండలానికి ఒక స్థానిక కోర్టును ఏర్పాటు చేయాలి. పట్టణ ప్రాంతాల్లో 50,000 జనాభాకు ఒక కోర్టు ఉండాలి. ఈ ఏర్పాటు వల్ల అందరికీ అందుబాటులో త్వరగా న్యాయం అందుతుంది.

**5) వ్యవసాయ సంక్షోభం**

## AGRICULTURAL TRADE
### *Imports Rising and Exports Falling*

| Year | Exports ($ bn) | Imports ($ bn) | Trade Surplus ($ bn) | US Dollar Average (in Rupees) | Trade Surplus (in Crore Rs.) |
|---|---|---|---|---|---|
| 2013-14 | 43.23 | 15.52 | 27.71 | 60.5 | 1,67,645.5 |
| 2014-15 | 35.57 | 19.57 | 16.00 | 61.1 | 97,760 |
| 2015-16 | 29.17 | 20.70 | 8.47 | 65.4 | 55,393.8 |
| 2016-17 | 33.87 | 25.63 | 8.24 | 67.07 | 55,265.68 |

Sources: Ministry of Commerce, GoI; Centre for Monitoring Indian Economy.

***Our surplus in agricultural trade has fallen by >Rs. 1.12 lakh crores ($19 billion).***

- **పెరుగుతున్న దిగుమతులు, పడిపోతున్న ఎగుమతులు**
- **ఏడాదికి 19 బిలియన్ డాలర్ల వ్యవసాయోత్పత్తుల డిమాండ్‌కు దెబ్బ**
- **దిగుమతులపై సుంకాన్ని రైతులకు బోనస్‌గా ఇవ్వాలి**
- **నిల్వ సదుపాయాలు, ప్లెడ్జి రుణాలు**
- **భూ సీలింగ్ చట్టాల సవరణ**
- **మెట్టప్రాంతాల సాగుకు ఉపాధి హామీ నిధుల్ని గరిష్టంగా వినియోగించటం**

ఆంధ్రప్రదేశ్‌లో సన్నకారు రైతుల ఆదాయం జాతీయ సరాసరి కంటే కూడా తక్కువగా ఉంది. ఎగుమతులు పడిపోతూ దిగుమతులు పెరుగుతుండటం మన వ్యవసాయ వాణిజ్యాన్ని దెబ్బతీస్తూ రైతుల ఆదాయానికి గండికొడుతోంది.


**పెరుగుతున్న దిగుమతులు, పడిపోతున్న ఎగుమతులు (ఏడాదికి రూ. 1.12 లక్షల కోట్ల డిమాండ్‌కు దెబ్బ)**

2013-14లో మన ఎగుమతులు 43.23 బిలియన్ డాలర్లుండగా, దిగుమతులు 15.52 బిలియన్ డాలర్లున్నాయి. 2014-15లో అవి 35.57, 19.57 బిలియన్ డాలర్లున్నాయి. 2015-16లో 29.17, 20.17 బిలియన్ డాలర్లు, 2016-17లో 33.87, 25.63 బిలియన్ డాలర్లు ఉన్నాయి. దీంతో మన అదనపు వ్యవసాయోత్పత్తుల వాణిజ్యం ఏడాదికి రూ. 1.12 లక్షల కోట్లు (19 బిలియన్ డాలర్లు) పడిపోయింది. ప్రభుత్వ జోక్యం లేకపోయినా రైతులు స్వశక్తితో అభివృద్ధి చేసుకున్న చేపలు వంటి ఎగుమతుల్ని కూడా కలుపుకుంటేనే ఇంతస్థాయిలో ఎగుమతులు పడిపోయాయి.

**దిగుమతులపై సుంకాన్ని రైతులకు బోనస్‌గా ఇవ్వాలి**

దిగుమతుల విషయంలో కూడా వ్యవసాయదారుల ప్రయోజనాలను పరిరక్షించేలా వ్యవహరించే విధానాలు లేకుండా పప్పుదినుసులు, నూనెగింజల్ని దేశంలోకి అనుమతి స్తుండటంతో మన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మనం ప్రపంచంలోనే అత్యధికంగా రూ. 1లక్ష కోట్ల మేర పప్పుల్ని, వంటనూనెల్ని దిగుమతి చేసుకుంటున్నాం. 2013-14లో పప్పులను మనం రూ. 12,792కోట్ల మేర దిగుమతి చేసుకుంటే, 2016-17లో అది రూ. 28,524 కోట్లకు చేరింది. అలాగే నూనెగింజల్ని 2013-14లో రూ. 60,750 కోట్ల దాకా దిగుమతి చేసుకుంటే, 2016-17లో అది రూ. 70,000 కోట్లకు చేరుకుంది.

దీంతో రాష్ట్రంలో మినుముల ధరల క్వింటాలు రూ. 16,000 నుంచి రూ. 4,000కు పడిపోయింది. పప్పులు, వంటనూనెల దిగుమతులపై 30-40శాతం సుంకం విధించి ఆ డబ్బును మన రైతులకే బోనస్‌గా ఇస్తే క్వింటాలుకు రూ. 382 రైతులకు లాభం చేకూరుతుంది. క్రమంగా రైతులు పుంజుకునేలా ప్రోత్సహిస్తే మూడేళ్లలోనే దిగుమతులు అవసరం లేకుండా దేశాన్ని




పప్పులు, వంటనూనెల్లో స్వయంసమృద్ధం చేస్తారు. ఖజానాపై భారం లేకుండానే ప్రభుత్వం రైతులకు ఆదాయాన్ని అందించవచ్చు, వ్యవసాయాన్ని కొంతమేర బాగుచేయవచ్చు.

## ధర ఉన్నప్పుడు అమ్ముకోవడానికి నిల్వ సదుపాయాలు - ప్లెడ్జి రుణాలు

వ్యవసాయాన్ని లాభసాటి చేయటానికి ఇతర చర్యల్లో నిల్వ సదుపాయాలు, ప్లెడ్జి (తనఖా పెట్టుకుని ఇచ్చే) రుణాలు ముఖ్యమైనవి. ప్రస్తుతం ఏపీలో గోదాముల సామర్థ్యం 19.48 లక్షల టన్నుల దాకా (ఏపీఎస్‌డబ్ల్యుసీ– 6లక్షల టన్నులు, ఏఎంసీలు–7.98 లక్షలు, ప్రైవేటు– 5.5 లక్షల టన్నులు) ఉంది. ఇంకా అదనంగా 5లక్షల టన్నుల సామర్థ్యానికి గోదాములు కావాలి. శీతల గిడ్డంగుల సామర్థ్యం కూడా పెరగాలి. ప్రస్తుత సామర్థ్యం 15.7లక్షల టన్నులుంది. ధర సక్రమంగా లేనప్పుడు నిల్వ చేసుకుని, తక్షణ డబ్బు అవసరం కోసం తెగనమ్ముకోవాల్సిన పరిస్థితులు లేకుండా ప్లెడ్జి రుణాలు సక్రమంగా అందిస్తే రైతులకు  చాలా ఊరట కలుగుతుంది. రాష్ట్రవ్యాప్తంగా 80లక్షలకు పైగా రైతులు వ్యవసాయం చేస్తుంటే రైతుబంధు పథకం ద్వారా రుణం పొందేవారు 3,500లోపే. నిల్వకు అవకాశం లేని టమాటా వంటి పంటల విషయంలో ప్రాసెసింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేయాలి. రైతుకు దక్కాల్సిన ఫలం మధ్యలోనే దళారీలకు పోతోంది. ఈ మార్కెట్ గొలుసు ప్రమేయాల్ని తగ్గించి రైతును, వినియోగదారుని నేరుగా కనెక్ట్ చేయగలిగితే వినియోగదారులు చెల్లించే ధరలో ఎక్కువశాతం నేరుగా రైతుకే దక్కుతుంది. ప్రస్తుం చాలా పంటల్లో 20శాతమే రైతుకు ఆదాయంగా వస్తోంది. రిటైల్ చెయిన్లను కూడా ప్రోత్సహిస్తే, వినియోగదారులు చెల్లించే మొత్తంలో 70శాతం రైతులకు దక్కుతుంది. రిటైల్ చెయిన్ల వల్ల ధరల ఒడిదుడుకులు తగ్గుతాయి, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి, మన బలాల్ని సద్వినియోగం చేసుకుని ప్రపంచ మార్కెట్‌లో పోటీపడగలుగుతాం.

## భూ సీలింగ్ చట్టాలు - పెట్టుబడులు

ఆంధ్రప్రదేశ్‌లో భూకమతాల సరాసరి పరిమాణం తగ్గిపోతోంది. 2005–06లో ఉన్న 1.13 హెక్టార్ల నుంచి 2010–11లో 1.06 హెక్టార్లకు తగ్గిపోయింది. ప్రస్తుతమున్న కౌలుచట్టాలు, భూ గరిష్ఠ పరిమితి (సీలింగ్) చట్టాలు కార్పొరేట్ పెట్టుబడులకు, పెద్దఎత్తున వ్యవసాయ నిర్వహణకు అవరోధాలుగా ఉన్నాయి. ప్రస్తుత ల్యాండ్ సీలింగ్ చట్టాలు.. రెండు పంటల సాగుభూములు 10–18 ఎకరాలు, మెట్ట భూములు 35–54 ఎకరాల పరిమితులను విధిస్తున్నాయి. వ్యవసాయంలో సాంకేతికతను, పారిశ్రామిక దృక్కోణాన్ని, మేనేజ్‌మెంట్ పద్ధతుల్ని, మార్కెట్ అవకాశాల్ని ప్రవేశపెట్టేందుకు పెట్టుబడులు కావాలి. ప్రస్తుతమున్న భూ చట్టాలను.. భూపరిమాణం, పెట్టుబడి, సాంకేతికతను పెంచేలా సమగ్రంగా ప్రక్షాళన చేయాలి.

## మెట్ట ప్రాంతాల సాగు - గ్రామీణ ఉపాధి హామీ పథకం

ఆంధ్రప్రదేశ్‌లో మెట్టభూముల సాగు విస్తృతంగా ఉంది. సాగుప్రాంతం 61.13 లక్షల హెక్టార్లుకాగా, నీటివనరులు 29.27 లక్షల హెక్టార్లకే ఉంది. 50శాతానికిపైగా సాగుప్రాంతానికి నీటి సౌకర్యం లేదు. వర్షం మీదే ఆధారపడి ఇక్కడ వ్యవసాయం చేయాల్సి ఉంటుంది.

ఈ సమస్యను అధిగమించటానికి వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్ కార్యకలాపాలకి గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల్ని వినియోగించుకోవాలి. పంట పొలాల్లో నీటి గుంతలు తవ్వే కార్యక్రమాన్ని భారీఎత్తున చేపట్టి వర్షపు నీటిని ఒడిసిపట్టాలి. భూగర్భ జలాల్ని రీఛార్జి చేయాలి. భూ సంరక్షణ కార్యక్రమాల్ని అమలు చేయాలి.

### ఎరువులు - సబ్సిడీ

అలాగే ఎరువుల పంపిణీలో రైతులకు ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డీబీటీ) సాధ్యం కాకపోవచ్చు. ఎందుకంటే, భూముల రికార్డులు సక్రమంగా లేవు. పొలానికి రైతులవారీగా, పంటను బట్టి ఎరువుల వినియోగం మారుతుంటుంది. ఎరువులు తెచ్చుకోవటానికి అవసరమైన సర్టిఫికేషన్ అవినీతికి దారితీసే అవకాశముంది.

## 6) స్థానిక ప్రభుత్వాలు (అధికార వికేంద్రీకరణ)

**LOCAL GOVERNMENTS**

*Devolution*

**Union to States:**
- Union Budget (2017-18) = 21,46,735 Cr.
- Transfers to States = Rs. 10,85,075 Cr; devolved to the state governments.
  - 50.5% of total Budget
  - 67% of total Non-Debt Receipts
  - 71% of Revenue Receipts

**State to Local Bodies:**
- Andhra Pradesh Budget 2017-18 is 1,56,999 Cr, which means the Expenditure Per Capita is 30,000 Rupees
- Transfers to PRIs by the state is mere 32 Rupees, which is 0.1% of total expenditure per capita. It is even lesser for ULBs, which are given a mere 12 Rupees.

| Transfers to PRIs, ULBs in Rupees | |
|---|---|
| Gram Panchayats | 8/person/year |
| Mandal Parishads | 16/person/year |
| Zilla Parishads | 8/person/year |
| Urban Local Bodies | 12/person/year |

Source: 3rd State Finance Commission Recommendations

కేంద్ర బడ్జెట్ 2017-18లో రూ. 21,46,735 కోట్లు ఉండగా, రాష్ట్రాలకు రూ. 10,85,075 కోట్లు బదిలీ అయ్యాయి.

- అంటే 50.5శాతం నిధులు కేంద్రం నుంచి బడ్జెట్‌లో రాష్ట్రాలకు వచ్చాయి.
- అప్పులు లేకుండా కేవలం పన్నుల డబ్బులో 67శాతం నిధులొచ్చాయి.
- రెవెన్యూ చెల్లింపుల్లో 71శాతం కేంద్రం నుంచి రాష్ట్రాలకు వచ్చాయి.

.. కానీ ఇదే రీతిలో రాష్ట్రం నుంచి స్థానిక ప్రభుత్వాలకు బదిలీ కావటం లేదు.

2017-18లో ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ రూ. 1,56,999కోట్లు. అంటే రాష్ట్రంలోని ఒక్కొక్క పౌరుని పేరు మీద రూ. 30,000 ఖర్చు చేస్తున్నారు. కానీ గ్రామ పంచాయతీలకు బదిలీ చేస్తున్నది మాత్రం కేవలం రూ. 32. అంటే మొత్తం తలసరి వ్యయంలో 0.1శాతం. వెయ్యికి ఒక్క రూపాయి అన్నమాట. ఇందులో.. గ్రామ పంచాయతీలకు ఏడాదికి తలసరి రూ. 8, మండల పరిషత్‌లకు రూ. 16, జిల్లా పరిషత్‌లకు తలసరి రూ. 8 ఇస్తున్నారు. పట్టణ స్థానిక ప్రభుత్వాలకు ఇంకా తక్కువగా తలసరి రూ. 12 మాత్రమే ఇస్తున్నారు

### పరిష్కారంగా ఏం చేయాలి

- తలసరి రూ. 1000లను పంచాయతీలు, మునిసిపాలిటీల (స్థానిక ప్రభుత్వాలు)కు కేటాయించాలి. అంటే రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాలకు రూ. 1460 కోట్లు, గ్రామీణ ప్రాంతాలకు రూ. 3470 కోట్లు ఇవ్వాలి.
- దీనివల్ల ప్రభుత్వానికి భారం ఉండకపోగా తగ్గుతుంది. బాధ్యతల్ని స్థానికానికి బదిలీ చేయటం వల్ల వివిధ విభాగాలకు రాష్ట్రస్థాయిలో అయ్యే ఖర్చు తదనుగుణంగా తగ్గుతుంది.
- స్థానిక స్థాయిలో ఉపాధిని ఇబ్బడిముబ్బడిగా పెంచటానికి చిన్న పట్టణాల మౌలిక వసతులు, విద్య, ఆరోగ్యం, నాణ్యమైన జీవితాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి.

(పూర్తి వివరాలకు www.youthforbetterindia.com ను సందర్శించండి) □

# సురాజ్య లక్ష్యాల కోసం పనిచేయుటం కంటే గొప్ప పోరాటాలు, ఉద్యమాలు ఏమున్నాయ్ ?



ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నా కొన్ని దశాబ్దాలుగా వెంటాడుతూ వస్తున్న సమస్యలను అందరికీ ఆమోదయోగ్యంగా, ఆర్థికభారం లేకుండా పరిష్కరించే ఆచరణాత్మక అవకాశాలున్నాయని, ఇందుకోసం అందరం కలిసి ఉద్యమించాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు. ప్రతి బిడ్డకూ ఖర్చు లేకుండా నాణ్యమైన విద్య, ప్రతి కుటుంబానికీ ఖర్చు లేకుండా మంచి ఆరోగ్యం, చట్టబద్ధపాలన, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల్లేని సేవలు, స్థానికంగా జనం ఉన్న చోటే అధికారాలు, విధులు, వ్యవసాయం లాభసాటి.. లక్ష్యాల కోసం పనిచేయటం కంటే గొప్ప ఉద్యమాలు, పోరాటాలు ఏమున్నాయ్ అని ప్రశ్నించారు. ఈ ఎజెండాయే సురాజ్య యాత్ర ఆరు లక్ష్యాలన్నారు.

కృష్ణాజిల్లాలో సురాజ్య యాత్రలో భాగంగా వివిధ వర్గాల ప్రజలను జేపీ కలుసుకున్నారు. మీడియా సమావేశాల్లో పాల్గన్నారు. సురాజ్య లక్ష్యాలపై చర్చిస్తూ ప్రజాభిప్రాయాన్ని ప్రతిఫలించే పరిష్కారాలను ప్రతిపాదించారు.

### వ్యాపారం తప్ప రాజకీయ పార్టీల్లేవు

దేశంలో, రాష్ట్రంలో ప్రస్తుతం చెలామణి అవుతున్న ఏ రాజకీయ పార్టీ కూడా అసలు పార్టీయే కాదని, ఇప్పుడున్నవి వారసత్వ వ్యాపారలావాదేవీల పక్షాలని జేపీ అన్నారు. ఒక సిద్ధాంతం.. పాడు లేదు, ఏదోక విధంగా అధికారంలోకి రావాలనే తపన తప్ప.. అని తేల్చిచెప్పారు. చాలాచోట్ల ఎవరు ఏ పార్టీలో ఉన్నారో ఎవరికీ తెలియదన్నారు. ఒకే నేత వేర్వేరు పార్టీల గుర్తు మీద పోటీ చేసి నెగ్గటం, ఏ పార్టీ అధికారంలోకి వస్తే అందులోకి జంప్ చేయటం రాజకీయంగా మారిందన్నారు. గతంలో విమర్శలు గుప్పించిన పార్టీలోకి బడా నేతలుగా గుర్తింపు పొందినవారు కూడా జంకుగొంకు, సిగ్గు లేకుండా చేరిపోతున్నారన్నారు. ఇదివరకు ఎందుకు విమర్శించారో, ఇప్పుడు ఎందుకు చేరారో మాత్రం చెప్పరన్నారు. ప్రజల జీవితాల్ని బాగుచేసే ఎజెండాను అమలు చేస్తూ ఓట్లు అడగకుండా, తాత్కాలిక తాయిలాల్ని ప్రకటిస్తూ, ప్రజల మధ్య కులం, మతం వంటి చిచ్చుల్ని పెట్టి గెలవాలని చూస్తున్నారన్నారు. అధికారం కోసం చస్తామంటున్నారు లేదా చంపుతామంటున్నారు, డబ్బు, కులం బట్టి వ్యాపారం చేస్తున్నారు.. అన్నారు. ఓట్ల వేటలో పడి చట్టాల్ని, రాజ్యాంగాల్ని ఫణంగా పెడుతున్నారని, కూర్చున్న కొమ్మనే నరుక్కుంటు న్నారని అన్నారు.

### కాపు రిజర్వేషన్ బిల్లు చట్టవిరుద్ధం

శాసనసభలో ప్రవేశపెట్టిన కాపు రిజర్వేషన్ బిల్లు చట్టవిరుద్ధమని, చట్టబద్ధంగా నియమితమైన కమిషన్ పూర్తిస్థాయి నివేదిక లేకుండానే ఎలా ఆమోదిస్తారని ప్రశ్నించారు. ఇదేమన్నా రాచరికపు పాలనా? అన్నారు. కాపులకు న్యాయం చేయటానికి ఇది పద్ధతి కాదన్నారు.

### సరైన రక్షణ లేక స్కూలు మానేస్తున్నా స్థానిక కోర్టులు, చట్టబద్ధ పాలన గురించి పట్టించుకోవటం లేదు

భారతదేశం అప్పులతో కూడా కలుపుకుని రోజుకు రూ.11,000కోట్లను మన పేరు మీద ఖర్చు చేస్తోందని, అయినప్పటికీ కీలకమైన విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు వంటి కీలకరంగాల్లో వెనకబడి ఉందని అన్నారు. రెండు వందల బిలియన్ డాలర్లకు పైబడిన జాతీయ ఆదాయంతో చెప్పుకోదగిన 49 దేశాల్లో మనదేశం చిట్టచివరి మూడు స్థానాల్లో ఉందని, పాకిస్తాన్, బంగ్లాదేశ్, నైజీరియాతో పోటీపడుతోందని అన్నారు. జనాభాలో అత్యధిక శాతం ఆధారపడిన వ్యవసాయంలో దారుణమైన విధానాలను అమలుచేస్తూ రైతులకు ఆదాయం లేకుండా ప్రభుత్వాలే చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలను అరికట్టేందుకు పౌర సేవల చట్టం వంటి ఏర్పాట్లు చేయకుండా, హక్కుగా అందాల్సిన సేవలకు గతి లేక లంచమిచ్చే పౌరులను జైల్లో పెడతామని, లంచాధికారులను మాత్రం ముద్దెట్టుకుంటామని పాలకులు

## వైద్యరంగానికి ఈమాత్రం కేటాయింపులు కూడా ఇవ్వరా?



వైద్య ఆరోగ్య రంగానికి కేటాయిస్తున్న నిధులు.. సామాన్యుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వానికున్న శ్రద్ధను తెలియచేస్తున్నాయని జేపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచ దేశాలు ఆరోగ్యానికి 5-8శాతం దాకా కేటాయిస్తుంటే, మన దగ్గర 1.1శాతం మాత్రమే ఉందన్నారు. రూ. 1,57,000 కోట్లు ఉన్న రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 2,000కోట్లను అదనంగా వైద్యానికి కేటాయిస్తే ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రతి ఒక్కరికీ జేబులో నుంచి ఖర్చు లేకుండా మెరుగైన వైద్యం అందుతున్నారు. ఒక జబ్బుకు, ఒక సీజన్‌కి అని కాకుండా, రెగ్యులర్‌గా మంచి ఆరోగ్యానికి వ్యవస్థ ఏర్పడుతుందన్నారు. రాష్ట్రానికి పేదరికం నుంచి విముక్తి, ప్రభుత్వానికి పేరు వస్తాయన్నారు. విజయవాడ కొత్త ప్రభుత్వాస్పత్రిని సురాజ్య యాత్రలో జేపీ సందర్శించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.చక్రధర్‌ని కలిసి వైద్యులు, ఇతర సిబ్బంది, రోగులు, నిధులు, ఖర్చు తీరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెడిసిన్, సర్జికల్, ఆర్థోపెడిక్ వార్డులను సందర్శించి రోగులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, రాష్ట్రంలో సురాజ్య యాత్రలో భాగంగా సందర్శించిన దాదాపు అన్ని ఆస్పత్రుల్లో.. కేటాయించిన నిధుల కంటే ఎక్కువ సేవలు అందుతున్నాయని, అయినా ప్రభుత్వం నిధులను పెంచటానికి ప్రయత్నించకుండా ప్రైవేటు, కార్పొరేట్‌లను ప్రోత్సహించే విధానాలను అనురిస్తోందని అన్నారు. దీనివల్ల ఖజానా నుంచి నిధులు ఖాళీ అవుతున్నాయి తప్ప ప్రజలకు మెరుగైన వైద్యం అందటం లేదన్నారు. వైద్యసిబ్బందికి జీతాలు పెంచటంతోపాటు, ప్రాథమిక స్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ నెట్‌వర్క్ వ్యవస్థని ఏర్పాటు చేయాలని, తమకు నచ్చిన డాక్టర్‌ని ఎంపిక చేసుకునే అవకాశం ప్రతి కుటుంబానికీ ఉండాలని అన్నారు. లోక్‌సత్తా నేతలు బండారు రామ్మోహనరావు, భీశెట్టి బాబ్జీ, కల్లూరి బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య, చెన్నుపాటి వజీర్, బి.అశోక్‌కుమార్, పూర్ణచంద్రరావు, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చెబుతున్నారన్నారు. పౌర సేవల చట్టం ముఖ్యంకానప్పుడు.. ఏపీ ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు అందే సేవల కోసం ఎందుకు ఆ చట్టాన్ని తీసుకొచ్చిందని ప్రశ్నించారు. సామాన్య ప్రజల సేవల కోసం కూడా ఈ చట్టాన్ని విస్తరించాలన్నారు. రోడ్ల మీద సరైన రక్షణలేక చదువు మానేస్తున్న బాలికలున్నా చట్టబద్ధపాలనను బలోపేతం చేయటం లేదని, స్థానిక కోర్టులు వంటి ఏర్పాట్లు చేయటం లేదని అన్నారు.

### భూసేకరణ చట్టంలో అతి

ఒకప్పుడు రైతుల నుంచి రాజుల్లాగా భూములు లాక్కుని ప్రభుత్వాలు తరిమేసేవని, అటువంటి పరిస్థితుల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్వాసితుల తరపున తాను అధికారిగా పోరాడి పరిహారం, ఉద్యోగాలు ఇప్పించానని జేపీ అన్నారు. ఇప్పుడేమో భూసేకరణ పేరుతో మితిమీరిన పరిహారాలను చట్టంలో పెట్టి ఉపాధి అవకాశాలకు గండికొడుతున్నారని అన్నారు. ఆచరణసాధ్యమైన భూసేకరణ విధానం మనకు అవసరమన్నారు. ఆందోళనలకన్నా, ఈ దిశగా రాజకీయ ఏకాభిప్రాయసాధన జరగాలన్నారు.

ఈ వైఫల్యాల్ని సరిచేయకుండా మనదేశం ఎప్పటికీ ఎదగదని, చిన్నప్పుడు విన్నట్టు ఎప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశంగానే ఉంటుందని, మనం అవకాశాల కోసం చేయిజాచి అర్థిస్తూనే ఉంటామని అన్నారు. ఈ పరిస్థితిని తేలిగ్గా సరిచేసే

**గమనిక:** జనం కోసం జేపీ సురాజ్య యాత్ర ఏపీలో పూర్తయినా.. విషయ ప్రాధాన్యత దృష్ట్యా ఆయా కార్యక్రమాలను లోక్‌సత్తా టైమ్స్‌లో వీలైనంత మేర ప్రచురిస్తున్నాం.

-ఎడిటోరియల్ టీం

అవకాశాలు ఇప్పుడు రాష్ట్రానికి, దేశానికి అందుబాటులో ఉన్నాయని, అందుకోసమే సురాజ్య యాత్రని వివరించారు. 'యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలో నమోదై ఈ కృషిలో పాలుపంచుకోవాలని యువత, ఇతర ప్రజలను జేపీ విజ్ఞప్తి చేశారు. చట్టంలోని లొసుగుల వల్ల ఫిరాయింపులు జరుగుతున్న మాట వాస్తవమని, కానీ ఫిరాయింపులను మించిన సంక్షోభం భారత రాజకీయ, పాలనా వ్యవస్థల్లో ఉందని ఒక ప్రశ్నకు సమాధానంగా జేపీ అన్నారు. ఫిరాయింపుల చట్టసవరణలో లోక్‌సత్తా పాత్ర ఉందని, కానీ ఆనాడు తాము సూచించనట్టు ఫిరాయించిన చట్టసభ సభ్యులపై చర్యలు తీసుకునే అధికారాన్ని ఈసీకి ఇచ్చివుంటే మెరుగ్గా ఉండేదని అన్నారు. పోలవరంపై రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేసిందని, ఇప్పటికైనా కాంట్రాక్టర్ల ప్రయోజనాలు, కులరాజకీయాల్ని పక్కనబెట్టి కేంద్రంతో కలిసి వేగంగా ప్రాజెక్టును పూర్తి చేయాలని అన్నారు. □

# బ్రిటన్ తీవ్ర సంక్షోభంలో కూడా ఎందుకు అందరికీ ఆరోగ్య విధానాన్ని అమలుచేసిందో ఇప్పటికీ ఆలోచించమా?

అందరికీ ఆరోగ్యాన్ని అందించే ప్రజారోగ్య విధానం వల్ల ప్రజలపై ఆర్థికభారం తగ్గటమేకాకుండా, రెండుమూడు కోట్ల ఉద్యోగాలస్తాయని, డాక్టర్లు, నర్సులు సహా వైద్యసిబ్బందికి కూడా ఎంతో ప్రయోజనం చేకూరుతుందని జేపీ అన్నారు. అందుకే వైద్య ఆరోగ్య విధానాలు ఎలా ఉన్నాయో వైద్యులు, వైద్య విద్యనభ్యసించే వారు కూడా పట్టించుకోవాలన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా కడప రిమ్స్‌లో జయప్రకాష్ నారాయణ్ పర్యటించారు. ఈ సందర్భంగా వైద్యవిద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతూ.. అందరికీ ఆరోగ్యాన్నిచ్చే విధానం కోసం లోక్‌సత్తా చాలాకాలంగా పోరాడుతోందని, జేబులో నుంచి ఖర్చు లేకుండా మంచి ఆరోగ్యం అందించే ఏర్పాటు లేకుండా ఏ దేశమూ ప్రపంచంలో అభివృద్ధి చెందిన దాఖలా లేదన్నారు. మన వద్ద వనరుల కొరత కూడా లేదని, ఉన్న వనరులకే కాస్త అదనంగా జోడిస్తే అందరికీ చక్కటి ఆరోగ్యాన్ని అందించవచ్చని అన్నారు. నివారించదగ్గ జబ్బులతో రోజుకు వేల మంది చనిపోతున్నా, ఐదేళ్లలోపు పిల్లలు 3,500మంది మరణిస్తున్నా, వైద్యఖర్చులు భరించలేక ఏటా 6కోట్లమంది పేదలుగా మారుతున్నా, ఇంకా అనేకమంది ఆస్పత్రులకు రాకుండానే నలిగిపోతున్నా.. మనదేశంలో ప్రజారోగ్యం గురించి చర్చ మాత్రం సరైనరీతిలో జరగటం లేదన్నారు. ఏడాదికి రూ.1లక్షా 57వేల కోట్ల బడ్జెట్ గల ఆంధ్రప్రదేశ్ వెయ్యో, రెండు వేల కోట్లో ఇచ్చి ఆరోగ్యాన్ని బాగు చేయలేదా? .. ఇది ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు.

ప్రైవేటు రంగంలో అతి తక్కువ జీతాలిచ్చే పనికిమాలిన ఉద్యోగాలకు ప్రభుత్వం అనేకరెట్లు జీతాలిచ్చి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని, అదే ప్రాణాలను కాపాడే ఆరోగ్యరంగంలో వైద్యులకు నెలకు రూ.40,000–50,000 జీతాలు మాత్రమే ఇస్తోందని జేపీ అన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ రంగంలో నిపుణులైన వైద్యునికి రూ.4లక్షల దాకా నెలవారీ ఆదాయం వస్తుందన్నారు. ఎంబీబీఎస్ చదవటానికి, ఆపైన పీజీ చేయటానికి తెలుగు రాష్ట్రాల్లో ఉన్నంత కష్టం మరెక్కడా ఉండదని, అలాగే వైద్యవృత్తికి ఎంతో డిమాండ్ ఉందని, అయినా మనదేశంలో ఎంబీబీఎస్ చేసి కూడా సరైన ఉపాధి అవకాశాలు లేకుండా ఖాళీగా ఉన్న వారు 3లక్షలమంది దాకా




ఉన్నారన్నారు. ఇలా ఏమాత్రం అర్థంలేని విధానాలను ఆరోగ్యరంగంలో పాలకులు కొనసాగిస్తున్నారన్నారు. సరైన వైద్యసేవలు అందించకపోతే మనదేశంలో వైద్యుల మీద దాడులు చేస్తున్నారని, అదే బ్రిటన్‌లో వైద్యులు మెరుగైన ఆదాయం కోసం సమ్మె చేస్తే 97శాతం మంది ప్రజలు వారికి మద్దతుగా నిలిచారని అన్నారు. వైద్యులు–ప్రజల మధ్య ఘర్షణ వాతావరణం వల్ల వైద్యులతోపాటు రోగులు కూడా తీవ్రంగా దెబ్బతింటారన్నారు. వైద్యంలో విశ్వసనీయతకు ఎంతో ప్రాధాన్యం ఉంటుందని, అది దెబ్బతింటే ఎన్ని మందులైనా పనిచేసే అవకాశం ఉండకపోవచ్చని అన్నారు. ఇలా వైద్యవృత్తి విలువలను, ప్రమాణాలను దెబ్బతినటానికి కూడా ప్రభుత్వ వైద్యవిధానమే కారణమని అన్నారు. ఒకరకంగా మనదేశంలో వైద్యం పేరుతో డబ్బు ఖర్చు చేయటం తప్ప, వైద్యవిధానమన్నదే లేదన్నారు. దీన్ని సరిచేయకపోతే ప్రజలతో పాటు వైద్యులు కూడా నష్టపోతారన్నారు.

బ్రిటన్ రెండో ప్రపంచ యుద్ధం తర్వాత తీవ్రంగా దెబ్బతిందని, అలాంటి పరిస్థితుల్లో నుంచి కోలుకోవాలంటే అందరికీ ఆరోగ్యం ముఖ్యమని భావించి, ఉన్న నిధుల్లోనే సార్వత్రిక ఆరోగ్య విధానాన్ని అమలు చేశారని జేపీ అన్నారు. ప్రపంచ యుద్ధాల పాఠాలను నేర్చుకుని భారతదేశానికి స్వతంత్రం వచ్చిన కాలంలోనే బ్రిటన్ అంత సాహసోపేత నిర్ణయం తీసుకుంటే.. ఆనాటి బ్రిటన్ కంటే మనం మెరుగైన స్థితిలో ఉన్నా కూడా ఇప్పటికీ ప్రజలకు నాణ్యమైన ఆరోగ్యాన్ని భారం లేకుండా అందించే విధానాన్ని అనుసరించలేకపోతున్నామన్నారు. అత్యుత్తమ విధానాలను నేర్చుకునే లక్షణాన్ని భారత్ ఇప్పటికీ పెంపొందించుకోలేకపోతోందన్నారు.

### జికా వైరస్ గురించి తెలుసుగానీ, ర్యుబెల్లా దారుణం గురించి తెలియదా?

గర్భస్థ దశలో ఉన్నప్పుడు పిల్లలకు గుండె జబ్బులు, ఇతర అంగవైకల్యాలు రాకుండా ర్యుబెల్లా టీకాను ఇవ్వాలని తాను 18 ఏళ్లుగా పోరాడుతుంటే, ఎట్టకేలకు ఈ ఏడాది సార్వజనీన టీకా కార్యక్రమంలో చేర్చారని జేపీ వివరించారు. ర్యుబెల్లా వల్ల మనదేశంలో ఏడాదికి ఎంతమంది నష్టపోతున్నారో తెలుసా? అని ప్రశ్నించగా వైద్యవిద్యార్థులెవరూ సమాధానం చెప్పలేకపోయారు. పోనీ జికా వైరస్ గురించి తెలుసా? అని జేపీ అడిగారు. తెలుసని అందరూ చెప్పారు. ఎక్కడో ఓ విదేశంలో ఒకట్రెండు డజన్ల మందికి వచ్చిన జికా వైరస్ గురించైతే మనం చాలా సంచలనంగా చర్చించుకున్నాం. కానీ మన చుట్టూ ఏటా రెండుమూడు లక్షలమంది నివారించదగ్గ ర్యుబెల్లా వ్యాధి బారినపడి అంగవికలురుగా పుడుతుంటే మాత్రం మనకు కనీసం స్పృహ కూడా లేదు. ఇక మీదట ఆ దారుణం ఆగిపోయిందని సంతోషించాలా, లేక గత 18ఏళ్లలో సుమారు 40-50 లక్షలమంది పిల్లలు అలా పుట్టారని బాధపడాలా? అని జేపీ ఆవేదనతో వ్యాఖ్యానించారు. కేవలం మన నిర్లక్ష్యం వల్ల ఇన్ని లక్షలమంది జీవితాలు అలా దెబ్బతిన్నాయని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారో ఒక్కసారి అంతరాత్మలతో ఆలోచించాలని అన్నారు. ఏడాదికి మనదేశంలో ఐదేళ్లలోపు పిల్లలు 12లక్షలదాకా మరణిస్తున్నారని, వీటిలో పలు మరణాలు నివారించదగ్గవని అన్నారు. చుట్టూ జరుగుతున్న పరిణామాలను, వైఫల్యాలను సరిచేయటానికి తగిన విధానాలను గురించి వైద్య విద్యార్థులు, సిబ్బంది ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలన్నారు.

దేశంలో నెలకు 11లక్షలమంది కొత్తగా ఉద్యోగాల కోసం మనదేశంలో రోడ్ల మీదకు వస్తున్నారని, ఒక్క వైద్యరంగాన్ని బాగుచేస్తేనే కోట్ల ఉద్యోగాలను సృష్టించవచ్చని జేపీ అన్నారు. అలాగే లోక్‌సత్తా ప్రతిపాదించిన అందరికీ ఆరోగ్య విధానంలో ఎంబీబీఎస్ వైద్యులు ఫ్యామిలీ డాక్టర్లుగా అందుబాటులో ఉంటారని, ప్రజలు తమకు నచ్చిన డాక్టర్‌ని ఎంపిక చేసుకుంటారని, ఎంతమంది ప్రజలు ఎంపిక చేసుకుంటే అంత వార్షిక ఫీజును ప్రభుత్వం ఆ వైద్యునికి చెల్లిస్తుందని వివరించారు. ఆ ఫ్యామిలీ డాక్టర్ రిఫర్ చేస్తేనే, పైస్థాయి చికిత్సకు రోగి రావాల్సుంటుందన్నారు. దీనివల్ల పటిష్టమైన ప్రాథమిక వైద్యం, సక్రమ వైద్య రికార్డుల వ్యవస్థ ఏర్పడుతుందని, దాదాపు 70శాతం రోగాలకు తొలిదశలోనే మంచి చికిత్స అందుతుందన్నారు. ఈ రకంగా క్లినిక్ నిర్వహణ ఖర్చులు పోగా, మెరుగైన డాక్టర్‌కి నెలకు రూ.1లక్షకు తక్కువ రాదన్నారు. సామర్థ్యాన్ని బట్టి ఆదాయం ఇంకా భారీగా పెరగవచ్చన్నారు. అందుకే ప్రజల మీద భారం లేకుండా వైద్యాన్ని అందించే విధానం ప్రజలు, వైద్యులు, దేశ ఆర్థిక వ్యవస్థ అందరికీ విన్-విన్-విన్ అవుతుందన్నారు. వైద్యవిద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు జేపీ ఈ సందర్భంగా జవాబిచ్చారు.

### వార్డుల సందర్శన

అనంతరం రిమ్స్‌లో వార్డులను జేపీ సందర్శించారు. వైద్యసేవలు అందుతున్న తీరును పరిశీలించారు. ప్రైవేటు ఆస్పత్రిలో అయ్యే ఖర్చులో పదోవంతుతో ఆస్పత్రిని నడుపుతున్నారని, అయినా మెరుగైన సేవలను అందించేందుకు ప్రయత్నిస్తున్నారని, తగినన్ని నిధులు, సరైన విధానాలతో వినియోగం లేకపోతే ముున్ముందు ఈ మాత్రం సేవలు కూడా ఉండవని హెచ్చరించారు. ఔట్‌సోర్సింగ్‌కి ఇవ్వటం వల్ల పారిశుధ్యం కొంత మెరుగుపడినా, సమస్యలు కొనసాగుతున్నాయని, ప్రాథమిక స్థాయి నుంచి వైద్యాన్ని బలోపేతం చేసి మౌలిక వసతుల్ని, సిబ్బందిని పెంచితేనే వీటికి శాశ్వత పరిష్కారం సాధ్యమని అన్నారు. అనంతరం వైద్యకళాశాలలో జేపీ మొక్కలు నాటారు.

రిమ్స్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, వైద్యాధికారులు డాక్టర్ గిరిధర్, వెంకట శివ, మాజీ ఎమ్మెల్సీ సుబ్బారెడ్డి, పీపుల్ అగనెస్ట్ కరప్షన్ వ్యవస్థాపకుడు మారంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, లోక్‌సత్తా 2.0 ఉద్యమ తెలంగాణ, ఏపీ కన్వీనర్ బండారు రామ్మోహనరావు, వైబీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు. □

### నర్సులను తక్కువ చేయవద్దు

మనదేశంలో నర్సులంటే కొంత చిన్న చూపు ఉందని, కానీ చాలా సందర్భాల్లో వాళ్లు డాక్టర్లతో సమానమైనవారేనని జేపీ స్పష్టంచేశారు. నర్సులకు నెలకు రూ.15,500 జీతమిస్తున్నారని, మెటర్నిటీ లీవులుండవని, ఏదైనా అనారోగ్య సమస్య వస్తే ఉచిత ఆరోగ్య స్కీములు వర్తించవని, ప్రభుత్వ రీఇంబర్స్‌మెంట్ ఉండదని అన్నారు. నర్సులు, ఏఎన్ఎంలు ఎదుర్కొంటున్న ఈ దారుణ పరిస్థితిని మారిస్తేనే ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించే వ్యవస్థ ఏర్పడుతుందన్నారు.

# మాట్లంలో మార్పుని అడ్డుకోవటం దుర్రాజ్యానికి పరాకాష్ఠ

వ్యవస్థలో మార్పు కోరుకుంటున్న మాట్లం గ్రామాన్ని అడ్డుకోవటం దుర్రాజ్యానికి పరాకాష్ఠని జేపీ అన్నారు. మిగతా రాష్ట్రానికి, దేశానికి దిక్సూచిగా మాట్లం ప్రజలు డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాలకు అమ్ముడుపోకుండా లోక్‌సత్తా అభ్యర్థులను గెలిపించారని, సర్పంచ్‌ని, పంచాయతీ తీర్మానాలను కూడా ఖాతరుచేయకుండా అధికార పార్టీవారు అవరోధాలు సృష్టించటం తగదని అన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా జేపీ కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలంలోని మాట్లంలో పర్యటించారు. మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం, మొగదారమ్మ గుడి ఎదుట గ్రామస్తులతో సమావేశమయ్యారు. లోక్‌సత్తా తరపున ఎన్నికైన సర్పంచ్ తమ్ము వెంకటలక్ష్మి, గ్రామస్తులు ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

జేపీ మాట్లాడుతూ, మన పన్నుల డబ్బు మనకే ఖర్చు చేయాలని తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీరామారావు పోరాడారని, ఇప్పుడు ఆ స్ఫూర్తికి అదే పార్టీ వారు గండికొట్టటం బాధాకరమని జేపీ అన్నారు. ఆనాటి కృషి వల్ల ఇప్పుడు కేంద్రం నుంచి రాష్ట్రానికి పన్నుల డబ్బులో ప్రతి 3 రూపాయలకు 2 రూపాయలు వస్తున్నాయని, ఆ డబ్బులో సగం డబ్బు గ్రామాలకు రావాలన్నారు. తలసరి రాష్ట్రంలో ఖర్చు చేస్తున్న డబ్బు లెక్క ప్రకారం మాట్లం గ్రామం పేరు మీద ఏడాదికి రూ. 15 కోట్లు ఖర్చవుతున్నాయని, అందులో సగం, 7.5కోట్లు స్థానికంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో ఖర్చవ్వాలని అన్నారు. గ్రామానికి నిధులివ్వకపోగా, కేంద్రం నుంచి వస్తున్న నిధులకు కూడా ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు ఎసరు పెడుతున్నాయన్నారు. మాట్లం గ్రామంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటులో నీరు ఉప్పుగా ఉండటం వల్ల ఊరి మధ్యలో ఉన్న చెరువును మంచినీటి చెరువుగా పంచాయతీ గుర్తించినా పైనుంచి అనుమతులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. మంచినీటి చెరువును చేపల చెరువుగా మార్చటం, నిలదీసినవారి మీద కేసులు బనాయించటం సహించరానిదన్నారు. ఒక గ్రామంలో మంచినీటి చెరువు ఉండి, పంచాయతీ తీర్మానం ఉండి కూడా ఆ ఊళ్లో జనం రోజుకు రూ. 30,000 మంచినీటి కోసం ఖర్చు చేస్తున్నారంటే.. వికృత కేంద్రీకృత పాలనకు, అధ్వాన్న రాజకీయానికి ఇంతకంటే నిదర్శనం అక్కర్లేదన్నారు. అన్ని సదుపాయాలూ ఉన్నా మంచినీటి కోసం చేస్తున్న ఖర్చు.. గ్రామానికి ఇప్పుడొస్తున్న నిధులకన్నా ఎక్కువన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రితో, ఉన్నతాధికారులతో మాట్లాడతానన్నారు. తమిళనాడు తీరప్రాంతంలో చేస్తున్న డీశాలినైజేషన్ పద్ధతిని మాట్లంలో ఏర్పాటు చేసేందుకు కూడా కృషి చేస్తానన్నారు. రాజకీయాల్లో చాలా చిక్కుముళ్లు ఉన్నాయని, దోపిడీ రాజకీయంలో మూలనపడ్డ మంచిని వెలికితీసేందుకు ఓపికతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఇల్లలకగానే పండుగ కాదని, ఎన్నికల్లో నెగ్గినా మార్పుని వ్యవస్థీకృతం చేయటానికి చాలా జాగ్రత్తగా, ఒడుపుగా కృషి చేయాలని అన్నారు. ఇందులో భాగంగానే పార్టీలకతీతంగా సురాజ్య యాత్రను నిర్వహిస్తున్నామన్నారు. ఒకసారి రాజకీయ ఊబి నుంచి బైటపడితే ఇతర పార్టీలు కూడా తేలిగ్గా లోక్‌సత్తా చెబుతున్న రాజకీయం, పాలన బాటలోకి వచ్చేస్తాయన్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు కొట్టుకుంటుంటే.. ఏపీలో జరుగుతున్న సురాజ్య యాత్రలో తెలంగాణ నేతలు పాల్గన్నారన్నారు. మాట్లంలో పరిష్కరించుకోలేని సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. యూత్ ఫర్ బెటర్ ఇండియా





**ఇలాంటి స్కూళ్లను నుంచి పాలకులు, అధికారులు పాఠాలు నేర్చుకోవాలి**





సురాజ్య యాత్రలో తాను చూసిన చాలా స్కూళ్లలో బోధన బాగాలేదని, బేసిక్ చదువు కూడా అందటం లేదని, మనసుకు నిజంగా సంతోషం కలిగించిన బహుతక్కువ పాఠశాలల్లో మాల్లం బడి ఒకటని జేపీ అన్నారు. ఇక్కడ చదువు బాగా అందుతోందన్నారు. పదవ తరగతి విద్యార్థుల్లో సత్తా కనిపిస్తోందన్నారు. లెక్కలు, సోషల్, సైన్స్ సబ్జెక్టుల్లో కాసేపు బోధించాక కొన్ని ప్రశ్నలడిగి జవాబుల్ని జేపీ రాబట్టారు. నైపుణ్యాల్ని ఇంకా పెంచుకోవాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని అప్‌డేట్ చేసుకుంటుండాలని, అప్పుడే ప్రపంచంలో ఎక్కడైనా ఉపాధిని పొందగలుగుతారని, కులం, మతం, డబ్బు వంటి అసమానతల్ని అధిగమించవచ్చని అన్నారు. పాఠ్యాంశాలను బట్టీ పట్టించకుండా సమస్య పరిష్కార కోణంలో బోధన చేయాలని, ఇందుకోసం ఉపాధ్యాయులు కూడా నిరంతరం అధ్యయనం చేస్తుండాలని సూచించారు. పాఠ్యాంశాలతోపాటు సమాజం గురించి కూడా పట్టించుకోవాలని, కొంత సమయాన్ని ఇందుకోసం కేటాయించాలని, దీనివల్ల పరిధి, గ్రహించే శక్తి పెరుగుతుంటాయన్నారు. యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలో నమోదైతే శక్తిసామర్థ్యాలను విస్తరించుకుంటూ ఎదగొచ్చన్నారు. అక్కడక్కడా ఉన్న మాల్లం స్కూలు వంటి వాటి నుంచి పాలకులు, అధికారులు పాఠాలు నేర్చుకుంటే కోట్ల మంది జీవితాలు బాగుపడతాయన్నారు.

డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలో నమోదై సంఘటితంగా పనిచేయాలన్నారు. లోక్‌సత్తా నేతలు తమ్మ ఏడుకొండలు, బండారు రామ్మోహనరావు, భీశెట్టి బాబ్జీ, బాలసుబ్రహ్మణ్యం, చెన్నుపాటి వజీర్, అశోక్‌కుమార్, రాజ్‌వర్మ, ప్రకాష్ కపిల, వైబీఐ నేతలు తదితరులు పాల్గొన్నారు. ◻

## నిధులు ప్రజావసరాలకు వినియోగమయ్యేలా చూడండి

**త**మ వార్డులో జవాబుదారీతనంలోని రీతిలో నిధులు ఖర్చవుతున్నాయని, దీనిపై చర్యలు తీసుకుని మౌలికసదుపాయల కల్పనకు నిధుల్ని వినియోగించేలా చూడాలని విజయనగరం 24వ వార్డు లోక్‌సత్తా పార్టీ నేతలు కలెక్టర్, మునిసిపల్ కమిషనర్‌లకు వేర్వేరుగా లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుకు ప్రజల సంతకాల పత్రాన్ని కూడా వారు జతపరిచారు. వీటీ అగ్రహారం, రెడ్డివీధి, గణేష్‌నగర్ తదితర చోట్ల రోడ్లు గుంతలు పడి, పారిశుద్ధానికి తగిన వర్షపునీటి కాలువలు లేకున్నా వాటిని బాగు చేయకుండా, దోమల నివారణకు చర్యలు తీసుకోకుండా.. ఉన్న కాసిని నిధుల్నీ ప్రైవేటు వ్యక్తులను బాగు చేసేరీతిలో కౌన్సిలర్ వినియోగిస్తున్నారని వివరించారు. స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, అధికారాల్ని మరింత పెంచాలని, దానితోపాటు జవాబుదారీతనానికి ఎన్నికైన వార్డు కమిటీలు, అంబుడ్స్‌మన్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాలని వారు కోరారు. లోక్‌సత్తా నేతలు ఆర్. రామునాయుడు, ఎల్.లక్ష్మణరావు, టి.పెంటబాబు, టి.అనిల్‌కుమార్, జి.నారాయణరావు, రెడ్డి మురళి, డి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వన్‌వే ట్రాఫిక్‌ను ఎత్తివేయాలి

సూర్యాపేట పట్టణంలో వన్‌వే ట్రాఫిక్‌ను హేతుబద్ధీకరించాలని, రోడ్డు భద్రతా ప్రమాణాలను పటిష్టం చేయాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లేటి రమేష్ కుమార్ డిమాండ్ చేశారు. వ్యాపారపరంగా అభివృద్ధి చెందుతున్న చోట ఏకపక్షంగా వన్‌వేలను అమలుచేయటం వల్ల వ్యాపారాలు దెబ్బతింటున్నాయన్నారు. కొన్ని వందల మంది ఉపాధి కోల్పేయే ప్రమాదం ఏర్పడిందన్నారు. వ్యాపారులు, ఇతర ప్రజల ప్రయోజనాలను సమన్వయం చేయటం చిన్న పనే అయినా అధికార యంత్రాంగానికి, ప్రజాప్రతినిధులకు పట్టటం లేదన్నారు. సమావేశంలో వెంకన్న, నాగరాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ◻



# మన వద్ద బెంచ్ మార్క్‌లేవీ?

మన వద్ద పాలనకు బెంచ్‌మార్క్‌లేవీ? అని చిత్తూరు సురాజ్య యాత్రలో జేపీ విద్యార్థులను ప్రశ్నించారు. ఓ ఇస్రోనో, ఓ అమూల్‌నో చూస్తే.. ఆ రంగంలో పనిని ఇలా చేయాలి అనే భావన మనకు ఏర్పడుతుందని, అలాంటి బెంచ్‌మార్క్‌లు మన పాలనా వ్యవస్థలో ఎక్కడున్నాయో ఆలోచించండి అన్నారు. ఈ సంభాషణ మదనపల్లెలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో జరిగింది.

ఇస్రో అతి తక్కువ ఖర్చుతో, ప్రపంచమే ఆశ్చర్యపోయే రీతిలో ఉపగ్రహాలను తయారుచేసి పంపుతోందని, ఆదాయాన్ని పెంచుకుంటోందని జేపీ అన్నారు. మనకు ఒక రంగంలో సాధ్యమైన బెంచ్‌మార్క్ ఇతర రంగాలలో ఎందుకు సాధ్యం కావటం లేదు? మన అధికార వ్యవస్థకు చేతగాకపోతే.. ఇదే అధికార వ్యవస్థ ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిజాయతీగా, వేగంగా పనిచేసిన సందర్భాలు అనేకమున్నాయి. అదెలా సాధ్యమైంది? వీఐపీల పర్యటనల్లో, పుష్కరాలు ఇతరత్రా ఈవెంట్ మేనేజ్‌మెంట్లలో మన పాలనా యంత్రాంగం అహో అనిపించేలా పనిచేస్తుంటుంది. అప్పుడెలా వచ్చింది బెంచ్‌మార్క్? ప్రభుత్వ కార్యాలయం ఇలా పనిచేయాలి అని మనం ఆచరణాత్మకంగా ఆలోచించి అందుకోసం మాట్లాడటం, సంఘటితంగా డిమాండ్ చేయటం, ఓటు వేయటం చేస్తే.. ఎందుకు సాధ్యం కాదు?.. అని జేపీ వేసిన ప్రశ్నలు విద్యార్థులను ఆలోచింపచేశాయి.

చుట్టూ ఉన్న సమస్యల్లో బతకటం వల్ల మనకేమీ నష్టం లేదని, మనకెరీర్, ఆదాయం మనకు ఉంటుందని ముడుచుకుని బతికితే తర్వాత నష్టపోవాల్సుంటుందని, సమాజం, పాలన బాగుపడకపోతే ఆ నష్టం కొందరికే కాకుండా అందరికీ ఉంటుందని జేపీ అన్నారు. పాఠశాల స్థాయిలో సరైన విద్య లేకపోవటం వల్లే ఇంజినీరింగ్ విద్యలో పలువురు రాణించలేకపోతున్నారన్నారు. అందరికీ మంచి స్కూలు విద్యనందించటం ప్రభుత్వ బాధ్యతని, ఆ పని పాలకులు, అధికారుల చేత ఎలా చేయించాలో అన్న ఆలోచనను మనం చేయకపోవటం వల్లే నష్టపోతున్నామని అన్నారు. మన జీవితాల్ని ప్రభావితం చేసే విద్య, ఆరోగ్యం, అవినీతిలేని సేవలు వంటి అంశాలపై అవగాహన కలిగిస్తూ చర్చను రేకెత్తిస్తూ పరిష్కారాలు సాధించేందుకే సురాజ్య యాత్రను చేపట్టామన్నారు.

విద్యతోపాటు వ్యక్తిత్వ నైపుణ్యాలను కూడా పెంచుకుంటేనే ఎదగగలుగుతారని జేపీ అన్నారు. పారదర్శకంగా ఉండటం, అవినీతిని సహించకపోవటం విద్యార్థుల నిత్యజీవితంలో భాగంగా మారాలన్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి పనిచేస్తుంటే, చదువులో, ఉద్యోగం, వ్యాపారంలో, జీవితంలో రాణిస్తామన్నారు.

విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు జేపీ జవాబులిచ్చారు. యువత సామాజిక రాజకీయాల్లోకి రావాలని, అప్పుడే అవినీతిరహిత భారతదేశం నిర్మాణమవుతుందని అన్నారు. ప్రస్తుతం దేశంలో అమలవుతున్న జీఎస్టీ వల్ల దీర్ఘకాలంలో లాభం ఉంటుందని, ఇందులో ఉన్న పలు లోటుపాట్లని సరిదిద్దడానికి ప్రభుత్వం సమర్థవంతంగా వ్యవహరించాలని అన్నారు.

విద్యార్థులు పుస్తకాల్ని, సమాజాన్ని నిరంతరం అధ్యయనం చేస్తూ సొంతంగా ఆలోచించాలని, పరిష్కారంలో భాగమవ్వాలని, సంఘటితంగా పనిచేయగలిగే సామర్థ్యాన్ని పెంచుకోవాలని జేపీ కోరారు. యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలో నమోదై మరింత మెరుగ్గా ఎదగాలని సూచించారు.

ప్రిన్సిపల్ రామలింగారెడ్డి, లోక్‌సత్తా నేతలు రామ్మోహనరావు, బాలసుబ్రహ్మణ్యం, ఎస్.జయ చంద్రారెడ్డి, అధ్యాపకులు, వైబీఐ ప్రతినిధులు పాల్గొన్నారు. □

### వాట్ నెక్స్ట్?

ఇంజినీరింగ్ విద్యలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, రాబోతున్నాయని, వీటిని సద్వినియోగం చేసుకునేలా విద్యార్థులు ఉపాధి నైపుణ్యాలను సంతరించుకోవాలని జేపీ అన్నారు. క్రమశిక్షణతో జీవితాన్ని ఆరంభిస్తే భవిష్యత్తులో నీతినిజాయతీలతో బతకొచ్చన్నారు.

# విద్యతోనే కులాలకతీతంగా గౌరవం



సురాజ్య యాత్రలో భాగంగా గుంటూరు జిల్లా చిలకలూరిపేట ఎస్సీ వసతిగృహాన్ని సందర్శించిన జేపీ అక్కడి విద్యార్థులతో మాట్లాడి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఉన్నంతలో మెరుగ్గా నిర్వహిస్తున్నారని కితాబిచ్చారు. కాసేపు విద్యార్థులకు పాఠాలు చెప్పి ఆలోచనాశక్తిని పెంచారు. విద్యావంతులు అయితేనే గౌరవం పెరుగుతుందని, అర్థమైన విద్యను ఎవరూ దొంగిలించలేరని అన్నారు. విద్యావంతులను కులాలకతీతంగా గౌరవిస్తారన్నారు. మనకు విద్య పట్ల గౌరవం ఉందిగానీ, విద్య విలువ ఇంకా తెలియదని, అది కూడా అర్థమైతే మన జీవితాల్లో గొప్ప మార్పు వస్తుందని అన్నారు. బట్టీ పట్టటం మానుకుని విషయాన్ని అర్థం చేసుకుంటూ మేధస్సును వికసింప చేసుకోవాలన్నారు. అప్పుడే గొప్ప విజయాల్ని కెరీర్‌లోనూ సాధించవచ్చన్నారు. మనం సుఖపడుతూ సమాజానికి మేలు చేయాలని, అలా లేకుంటే క్రమంగా మన సుఖాలు కూడా దెబ్బతింటాయని అన్నారు. పొరుగున ఎక్కడో మురికివాడలో పోరడిని కుట్టిన దోమ సంపన్నుల ఇంటికి కూడా వచ్చి కుడుతుందన్నారు. జబ్బుల్ని అంటిస్తుందన్నారు. ఈ విషయాన్ని లోక్‌సత్తా చాలా ఏళ్లుగా హెచ్చరిస్తోందని, ఇప్పుడిప్పుడే ఉన్నవాళ్లు అర్థం చేసుకుంటున్నారని అన్నారు. ఢిల్లీలో కాలుష్యం దెబ్బకి సంపన్నులు, వనరులున్నవారు కూడా సతమతమవుతున్నారని, సమాజం ఎటుపోయినా మనకేంటి అని ఇప్పటిదాకా అనుకున్నవాళ్లు పాలన, రాజకీయం గురించి కొంత పట్టించుకోవటం మొదలుపెట్టారని అన్నారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఈ సందర్భంగా జేపీ జవాబులిచ్చారు. వసతి గృహం నిర్వాహకుడు రాజబాబును అభినందించారు. ఆవరణలో విద్యార్థు లతో కలిసి జేపీ మొక్కల్ని నాటారు.

**ఓగేరు వాగుపై వంతెన నిర్మాణం జరగాలి**

ఆ తర్వాత చినపసుమర్రులోని అయ్యప్పస్వామి గుడి సమీపంలోని పత్తి పంటలను పరిశీలించి రైతులతో జేపీ మాట్లాడారు. ఎకరాకు రూ. 40,000 పెట్టి పత్తిని పండిస్తున్నామని, పురుగు పడి కాయ పాడై పోయిందని రైతులు తెలిపారు. నష్టపోతూ పత్తి పండించుకునే కంటే ఇతర పంటల వైపునకు దృష్టి సారించాలని జేపీ సూచించారు. రైతులకు ఎంతో ఉపయోగపడే ఓగేరు వాగు వంతెన నిర్మాణం కోసం లోక్‌సత్తా నేతలు చాలాకాలంగా కృషి చేస్తున్నారని, ఈ నిర్మాణాన్ని ప్రభుత్వం వేగంగా చేపట్టాల్సుందని అన్నారు.

# ప్రభుత్వాస్పత్రి సందర్శన



అనంతరం పేటలోని ప్రభుత్వాస్పత్రిని జేపీ పరిశీలించారు. రోగులకు అందుతున్న సౌకర్యాలను తెలుసుకున్నారు. వైద్యులతో నిధులు, ఇతర వసతుల వివరాలపై మాట్లాడారు. ఆస్పత్రిలో అత్యవసర చికిత్స చేయడానికి సౌకర్యాలు లేవని, సిబ్బంది తక్కువగా ఉన్నారని వైద్యులు తెలిపారు. జాతీయ రహదారి పక్కనే ఉన్నందున ప్రమాదాల కేసులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. అంబులెన్స్ కూడా పనిచేయటం లేదని వైద్యసిబ్బంది సమస్యలను ఏకరువు పెట్టారు. ఒక ఒరవడిలా ప్రభుత్వాస్పత్రులకు వనరుల్ని కుదిస్తున్నారని, చాలా రంగాల్లో ప్రైవేటు కంటే ఎక్కువ జీతాలనిస్తున్న ప్రభుత్వం కీలకమైన వైద్యరంగంలో మాత్రం నిపుణులకు కూడా తక్కువ జీతాలనిస్తోందని జేపీ వ్యాఖ్యానించారు. పేదల ఎదుగుదల పట్ల ప్రభుత్వాలకు ఎంత శ్రద్ధ ఉందో ఈ పరిస్థితులు అద్దం పడుతున్నాయన్నారు. వీటన్నిటిపై ప్రజల్లో, రాజకీయ వ్యవస్థలో అవగాహన పెంచేందుకే సురాజ్య యాత్ర చేస్తున్నామని, వివరాల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మార్పు కోసం గట్టి ప్రయత్నం చేస్తామని తెలిపారు. లోక్‌సత్తా, వైబీఐ నేతలు రామ్మోహనరావు, బాబ్జీ, మాదాసు భానుప్రసాద్, దుర్గాదేవి, శ్రీనాథ్‌రెడ్డి, సాదిక్, లక్ష్మాజీ, అబ్దుల్‌ఖర్, కేవీ రెడ్డి, మారం ప్రసాద్, మురికిపూడి ప్రసాద్, సాంబశివరావు, వెంకట్రావు, లక్ష్మణ్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ◻

# షేక్స్పియర్‌కి దక్కుతున్న గౌరవం మొల్లకు ఎందుకు దక్కటం లేదు?.. గ్రామపెద్దలు కదలాలి, యువతను నడిపించాలి


గ్రామాల అభివృద్ధికి స్థానికంగా కాస్త పలుకుబడి, అవగాహన ఉన్నవారు పూనుకోవాలని జేపీ పిలుపునిచ్చారు.

కడప జిల్లా బయనపల్లెలో యువత ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సురాజ్య యాత్రలో భాగంగా పాల్గన్న జేపీ మాట్లాడుతూ.. గ్రామంలో అభివృద్ధి దశ, దిశ సక్రమంగా లేదని సోదాహరణంగా స్పష్టం చేశారు. తాను అంతకుముందే మండల కార్యాలయానికి వెళ్లి వస్తున్నానని, పెద్ద కార్యాలయం తప్ప ప్రజలకు సేవలనందించే వాతావరణం లేదన్నారు. మండల కార్యాలయానికి వెళ్లటానికి ముందు గురుకుల పాఠశాలను సందర్శించానని, 1/3, 1/4ల్లో ఏది పెద్ద అనే విషయాన్ని 8,9 తరగతులు చదువుతున్న పిల్లలు కూడా చెప్పలేకపోయారని అన్నారు. ఈ పరిస్థితిని ఇలాగే వదిలేస్తే.. ప్రభుత్వాలు మారుతుంటాయి, మన పేరు మీద నిధులు ఖర్చవుతుంటాయి తప్ప గ్రామంలో జీవితాలు మాత్రం మారవన్నారు. కొద్దిమంది మినహాయించి మిగిలినవారికి ఎదిగే అవకాశాలు లభించవన్నారు. కాస్త పలుకుబడి ఉన్న వారు తమ సమయాన్ని, వనరులను వినియోగించి స్కూళ్లను, ప్రభుత్వ కార్యాలయాలను బాగు చేయాలన్నారు.

గ్రామంలో ఉపాధి కోసం చూస్తున్న యువత బోలెడుమంది ఉన్నారని, కానీ ఎన్నిసార్లు ఏపీపీఎస్సీ నోటిఫికేషన్లిచ్చినా వారిలో అత్యధికులకు ఉద్యోగాలు రావని జేపీ అన్నారు. దేశానికి స్వతంత్రం వచ్చినప్పటి నుంచి ఎంతమందికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలచ్చాయో అంతమంది ఇప్పుడు ఏడాదికి కొత్తగా ఉద్యోగాల కోసం రోడ్లమీదికి వస్తున్నారన్నారు. వీరందరికీ ప్రభుత్వం ఉద్యోగాలిచ్చే







అవకాశం లేదన్నారు. ఇక్కడే ఉపాధిని పెంపొందించుకునేందుకు పెద్దలు చొరవ తీసుకుంటే యువతకు మేలు జరుగుతుందన్నారు. ఇక్కడ నెలకి రూ.10వేలు వస్తే, పెద్ద నగరాల్లో రూ.25వేలతో సమానమని, అక్కడ కూడా అందరికీ ఉద్యోగాలు లేవని గుర్తించాలని అన్నారు. ఎక్కడికక్కడ స్థానికంగా ఉద్యోగావకాశాలను కల్పించేలా విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, లంచాల్లేని సేవలు, చట్టబద్ధపాలన వంటి లక్ష్యాల సాధనకే సురాజ్య యాత్రను చేపట్టామన్నారు. స్థానికంగా పంచాయతీలకు అధికారాలు, నిధులు ఇవ్వాలని సర్పంచ్, ఇతర ఊరిపెద్దలు పట్టుబట్టాలన్నారు.

ఈ సందర్భంగా గోపవరంలో తాను కవయిత్రి మొల్ల ఇంటిని చూసిన ఉదంతాన్ని జేపీ ప్రస్తావించారు. తొలి కవయిత్రిగా ఘనత వహించిన మొల్ల ఇల్లు బావురుమంటోందని, అదే మొల్ల తర్వాత వందేళ్లకు పుట్టిన షేక్స్పియర్ ఇంటిని చూడటానికి సందర్శకులు పోటీపడుతుంటారని అన్నారు. తాను రెండుసార్లు షేక్స్పియర్ ఇంటిని సందర్శించానన్నారు. అంత ఆకర్షణీయంగా ఆ ఇంటిని తీర్చిదిద్దారని, అదే పనిని ఇక్కడ చేసి ఉపాధిని పెంచుకునేందుకు ప్రయత్నించాలని సూచించారు. అలాగే సోమశిల బ్యాక్‌వాటర్స్‌లో బోట్‌రైడింగ్ వంటి వాటిలో పెట్టుబడులకు సానుకూల వాతావరణం కల్పించాలన్నారు. ఎవరైనా ఇలా పెట్టుబడులకు ముందుకొస్తే, గ్రామంవాటాగా కొంత డబ్బును జత చేసేందుకు స్థానికంగా నిధులుంటే వెంటనే వీలవుతుందన్నారు. ఇలా రకరకాలుగా ఉపాధి అవకాశాలను పెంచేందుకు, గ్రామాన్ని అభివృద్ధి చేసుకునేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి ఊరికీ తాను వెళ్లలేను కాబట్టి ఇది గ్రామస్తుల పని అని చెబుతున్నానుగానీ, ఇది నా సొంత పనిగానే భావిస్తానని జేపీ చెప్పారు. యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలో నమోదైతే నిరంతరం తన సలహాసూచనల్ని అందిస్తుంటానన్నారు. సర్పంచ్ జయసుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్బారెడ్డి, కమ్యూనిస్టు సీనియర్ నాయకుడు పుల్లారెడ్డి, పీఏసీ శ్రీకాంత్‌రెడ్డి, సురేష్, రామ్మోహనరావు, జగన్నాథరెడ్డి, సతీష్‌కుమార్, ఉత్తమ్‌రెడ్డి, పీవీ సుబ్బారెడ్డి, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. □

# పేషెంట్లు నెలకు 18,000మంది .. మందులకు మాత్రం రూ.1లక్షే



రోజుకు 500 మంది వరకు ఔట్‌పేషెంట్లు, 100మంది ఇన్‌పేషెంట్లకు సేవలందించే ఆస్పత్రిలో మందుల కోసం నెలకు కేవలం రూ. 1లక్ష కేటాయించటం దారుణమని జేపీ అన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా రాయదుర్గం ప్రభుత్వాస్పత్రిని జేపీ సందర్శించారు. వార్డులు, రక్తపరీక్ష కేంద్రం, మందుల నిల్వ కేంద్రాన్ని పరిశీలించి రోగులతో మాట్లాడారు. సౌకర్యాలు, నిధుల కేటాయింపు, వినియోగంపై వైద్యులనడిగి తెలుసుకున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో వందమంది పిల్లలు కూడా లేని ఒక ఉన్నత పాఠశాలపై వెచ్చిస్తున్నపాటి వ్యయం కూడా చాలా చోట్ల వైద్యశాలల కోసం ఖర్చు చేయటం లేదని జేపీ అన్నారు. రాయదుర్గం సామాజిక ఆస్పత్రిలో ఔట్‌పేషెంట్ల తాకిడి తీవ్రంగా ఉంటోందని, ఇన్‌పేషెంట్లుగా రోజూ దజన్ల సంఖ్యలో వచ్చి చేరుతున్నారని, ఇద్దరు ఒప్పంద వైద్యులు తీవ్ర ఒత్తిడి మధ్య విధుల్ని నిర్వహిస్తున్నారని అన్నారు. కనీస స్థాయిలో కూడా మందులు అందుబాటులో లేవన్నారు. అనారోగ్యం వల్ల రోజుకు 3,500మంది ఐదేళ్లలోపు చిన్నారులు అకాలమరణం చెందుతున్నా, వైద్య ఖర్చుల వల్ల ఏటా 6కోట్లమందికిపైగా పేదలుగా మారిపోతున్నా మనదేశంలో ఆరోగ్య రంగం గురించిన చర్చ సరిగా జరగటం లేదన్నారు. అనవసర రాజకీయాలపై చేస్తున్న చర్చల నుంచి పత్రికలు, టీవీలు, చట్టసభలు, ప్రభుత్వాలు ఆరోగ్యరంగంపై దృష్టి సారించాలన్నారు. ప్రాథమిక, ఏరియా ఆస్పత్రుల్ని బలోపేతం చేయటంతోపాటు జిల్లా స్థాయి ఆస్పత్రుల్ని సూపర్ స్పెషాలిటీలుగా తీర్చిదిద్దాలన్నారు. వైద్యరంగానికి ఇప్పుడు కేటాయిస్తున్న 1.1శాతానికి అదనంగా మరోశాతాన్ని కేంద్ర ప్రభుత్వం కేటాయించాలని, ఆరోగ్యశ్రీ వంటి కార్యక్రమాలతో ప్రైవేటు రంగానికి చేస్తున్న కేటాయింపుల్ని సద్వినియోగం చేసి రూ. 2,000కోట్ల వరకూ రాష్ట్ర ప్రభుత్వం జనాసుపత్రులకు కేటాయించాలని అన్నారు. లక్షల కోట్ల బడ్జెట్ ఉన్న ప్రభుత్వాలకు ఇది చాలా చిన్న పని అన్నారు. ఈ పనిచేస్తే చాలు సామాన్య, మధ్యతరగతికి కూడా మంచి వైద్యం అందుబాటులోకి వస్తుందన్నారు. వైద్యాన్ని బాగు చేస్తే బడ్జెట్ కూడా ముమ్ముందు తగ్గుతుందని, వైద్యాన్ని నిర్లక్ష్యం చేసినకొద్దీ భారం పెరుగుతూ సమర్థ వైద్యులు కూడా లేక చివరకు ప్రజారోగ్యం పెద్ద సంక్షోభానికి లోనవుతుందని అన్నారు.

వైద్యులు మన్సూర్ అలీఖాన్, గీతాజ్యోతి, లోక్‌సత్తా నేతలు రామ్మోహనరావు, బాజ్జీ, బి. వెంకటరమణబాబు, అబ్దుల్లా, రియాజ్, సిద్ధప్ప, వైబీఐ నేతలు పాల్గొన్నారు. ◻



### జేపీని కలిసిన మంత్రి కాలవ

అనంతపురం జిల్లా సురాజ్య పర్యటనలో ఉన్న జేపీని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖా మంత్రి కాలవ శ్రీనివాసులు రాయదుర్గంలో మర్యాదాపూర్వకంగా కలిశారు. తన నియోజకవర్గానికి వచ్చినందుకు అభినందనలు తెలిపారు. గత పదేళ్లలో రాయదుర్గం ప్రాంతంలో వర్షాభావ పరిస్థితులు, రైతుల పరిస్థితి, వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధరలు, నిరుద్యోగ యువతకు ఉపాధి, బీటీ ప్రాజెక్టు తదితర విషయాలపై ఇద్దరూ చర్చించారు. ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ, ప్రభుత్వం వ్యవసాయం, పరిశ్రమలను అనుసంధానించాలని, స్థానికంగా యువతకు ఉపాధిని కల్పించాలని, ఉద్యోగాలిచ్చే పరిశ్రమలను ప్రోత్సహించాలని కోరారు. మంత్రి మునిసిపల్ ఛైర్మన్ జ్యోతి, వైస్ ఛైర్మన్ వెంకటేశులు, వార్డు సభ్యులు, టీడీపీ నాయకులను జేపీకి పరిచయం చేశారు.

# ఎన్నికల రాజకీయ వ్యవస్థే ఏకైక మార్గం కాదు

సమాజంలో మంచి మార్పులకు ఎన్నికల రాజకీయ వ్యవస్థే ఏకైక మార్గం కాదని జేపీ అన్నారు. ఎన్నికల్లో గెలిచి అధికారంలోకొస్తే వేగంగా మార్పు తెచ్చే అవకాశముంటుందని, కానీ అధికారంతోనే అన్నీ మారిపోతాయంటే ఈపాటికి భారత్‌లో పెద్దమార్పులు వచ్చేసివుండాల్సిందని అన్నారు. ప్రధానమంత్రి, కేంద్రమంత్రులు, ముఖ్యమంత్రులు, మంత్రులు దేశాభివృద్ధిపై ఊకదంపుడు ఉపన్యాసాలు, నినాదాలు ఇస్తున్నారే తప్ప.. సాధిస్తున్నది మాత్రం పెద్దగా లేదన్నారు. రాజకీయాన్ని మార్చాలంటే నిర్దిష్టమైన హేతుబద్ధ విధానాలు, ప్రజల భాగస్వామ్యం కీలకమన్నారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ పోటీచేయలేరని, కానీ వారి భాగస్వామ్యం జాతికి అవసరమని అన్నారు. ఆ రకమైన రాజకీయం, పాలన ఉంటేనే దేశంలో, సమాజంలో మనందరి మనసుల్లో కోరుకుంటున్న మంచి మార్పులు సాధ్యమవుతాయన్నారు. ఇదంతా పురాణగాథ కాదని, పూర్తిగా ఆచరణసాధ్యమని అన్నారు. జర్మనీ, జపాన్ వంటి దేశాలు వందేళ్ల క్రితమే మౌలిక వసతుల్ని కల్పించటంలో ముందున్నాయన్నారు. పూర్తిగా ధ్వంసమైనా వేగంగా కోలుకున్నాయన్నారు. జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా ఆయన చిత్తూరు జిల్లా రేణిగుంట మండలం మల్లవరం శ్రీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో చర్చా కార్యక్రమంలో పాల్గన్నారు.

ఎంతో వైవిధ్యం, కులాలు, మతాలు వంటి సంక్లిష్టతలు ఉన్నా భారతదేశం తన ఐక్యతను కాపాడుకోగలిగిందని, ప్రజాస్వామ్యాన్ని ప్రాథమికంగా నిలబెట్టుకోగలిగిందని, అయితే రాజకీయం, పాలనను మెరుగుపరచగల వ్యవస్థల్ని మాత్రం ఏర్పాటు చేసుకోలేకపోయిందని ఈ సందర్భంగా జేపీ అన్నారు. దాని వల్లే స్వతంత్రం వచ్చి 70ఏళ్లు దాటినా ఇప్పటికీ పుట్టుక కారణంగానే కోట్లాదిమంది బిడ్డల భవిష్యత్తులు నిర్ణయమైపోతున్నాయన్నారు. అపారమైన పేదరికం, అవిద్య ఉన్న దేశంలో అందరికీ ఓటుహక్కు ఇచ్చేసి, దాన్ని సద్వినియోగం చేసే వ్యవస్థీకృత ఏర్పాటు లేకపోవటం వల్ల.. అరుపులు, రాస్తారోకోలు తప్ప ప్రజాస్వామిక పరిపాలన కొరవడిందని, సమర్థులు ఎన్నికవలేకపోతున్నారని అన్నారు. ఎన్నికైనవారిలో పలువురు అనర్హులు అయినకాడికి దోచుకుంటున్నారన్నారు. రాజ్యాంగాన్ని పార్టీ రాజకీయంగా మార్చేశారన్నారు. గాంధీజీ కలలుగన్న స్వరాజ్యాన్ని దుర్రాజ్యంగా తయారుచేశారన్నారు.

సరైన రాజకీయం, పాలన లేకపోవడం వల్లే.. స్వతంత్రం వచ్చినప్పుడు మనకంటే వెనకబడిన పలు దేశాలు ఈవేళ మనకంటే అగ్రస్థానంలో నిలిచాయని జేపీ అన్నారు. దీన్ని మార్చగలిగే లక్ష్యాలతోనే సురాజ్య యాత్రను చేస్తున్నామన్నారు. దేశంలో రోజూ ప్రజల పేరు మీద రూ.11,000కోట్లు ఖర్చు చేస్తున్నా సరైన భద్రత, చదువు, ఆరోగ్యం, లంచాల్లేని సేవలు అందటం లేదన్నారు. దేశ జనాభాలో అత్యధికులు వ్యవసాయంలో ఉంటే, వారికి న్యాయమైన ఆదాయం లేదన్నారు. కోర్టుల్లో కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నూటికి ఆరు కేసుల్లో మాత్రమే శిక్షలు పడుతున్నాయన్నారు. 94 కేసుల్ని కొట్టివేస్తున్నారన్నారు. కోర్టు మెట్లెక్కకుండా అన్యాయాన్ని దిగమింగుకుంటున్నవారు అనేకమంది ఉన్నారన్నారు. డబ్బు, కండబలం, రాజకీయ బలం ఉన్నవారికే కోర్టుల్లో న్యాయం జరుగుతుందన్న ఆవేదన సమాజంలో పెరుగుతోందన్నారు. ఈ వాస్తవాల్ని యువత ఆకళింపు చేసుకోవాలన్నారు. ఇతర దేశాల్లో ఉన్న అనుభవాలను, ఉదాహరణలను చూసి గ్రహించాలన్నారు. రాజకీయం మారేంతవరకూ ఈ మార్పులు రావన్న నిరాశ అక్కర్లేదని, ఎన్నికలకు-ఎన్నికలకు మధ్య పాలనను మార్చుకునేందుకు అవకాశం ఉందన్నారు. దీన్ని వినియోగించుకుని మార్పు సాధించుకోవాలన్నారు. ఇందుకోసమే నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, వ్యవసాయంలో ఆదాయం, స్థానికంగా అధికారాలు, నిధులు, చట్టబద్ధపాలన అనే ఆరు లక్ష్యాలతో సురాజ్య యాత్రతో ప్రజల ముందుకొచ్చామని, యువత, ఇతర పౌరులు యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలో ఎన్‌రోల్ అయి తమ వంతు సామాజిక కృషి చేయాలని పిలుపునిచ్చారు. జాతి నిర్మాణంలో యువత పాత్ర కీలకమన్నారు. కళాశాల ఛైర్మన్ దామోదరం, వైస్ ఛైర్మన్ వేణుగోపాల్, ప్రిన్సిపల్ శేషగిరి, కన్వీనర్ హర్షవర్ధన్‌రెడ్డి, లోక్‌సత్తా నేతలు రామ్మోహనరావు, విజయకిరణ్, లోకేష్‌బాబు, బాలసుబ్రమణ్యం, బెల్లంకొండ సురేష్, వైబీఐ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. ◻



**మహాత్మాగాంధీ చేసిందిదే**

రాజకీయం, సామాజిక సంస్కరణ రెండూ ఒకటే. మహాత్మాగాంధీ చేసిందిదే అని జేపీ అన్నారు. తమ కెరీర్‌ను చూసుకుంటూనే యువత కొంత సమయాన్ని సమాజం కోసం వెచ్చిస్తే వారికే ఎంతో లాభం చేకూరుతుందన్నారు.

# సురాజ్యస్థాపన కోసం కృషి చేసే పార్టీలకు మా మద్దతు




హేతుబద్ధమైన, ఆచరణాత్మకమైన విధానాలతో యువత, రైతులు, దళితులు–పేదలు లక్ష్యంగా ప్రజలకు సేవ చేసే పార్టీలకు తమ మద్దతు ఉంటుందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తెలిపారు. దేశాభివృద్ధికి దోహదం చేసేవారితో తమకెప్పుడూ వైరుధ్యం ఉండదన్నారు. చిన్న విభేదాలతో పెద్ద ప్రయోజనాలను దెబ్బతీయటం లోక్‌సత్తా చరిత్రలో లేదన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్ర కోసం పశ్చిమ గోదావరి జిల్లాకు వచ్చిన జేపీ తాడేపల్లిగూడెంలో మీడియాతో మాట్లాడారు.

ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేయకుండా ఖర్చు చేస్తే మనదేశం తక్కువ సమయంలోనే ఉన్నతస్థానానికి ఎగబాకగలుగుతుందని జేపీ అన్నారు. ఇందుకోసం కావలసిన విద్య, ఆరోగ్యం, మెరుగైన ప్రభుత్వ సేవలు, చట్టబద్ధపాలన, లాభసాటి వ్యవసాయం, స్థానిక ప్రభుత్వాల బలోపేతం ఎజెండాతోనే సురాజ్య యాత్రను నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు వాస్తవాలు అర్థమై డిమాండ్ చేయటం మొదలుపెడితే, మార్పు త్వరగా వస్తుందన్నారు.

కేంద్రం నుంచి రాష్ట్రాలకు వస్తున్న నిధుల్లో చాలా తక్కువ మాత్రమే స్థానిక ప్రభుత్వాలకు చేరుతున్నాయని, ఫలితంగా జనం ఉండే చోట అవసరాలకు తక్షణం నిధులు దొరకడం లేదని అన్నారు. వాస్తవానికి రాష్ట్రాలకు వస్తున్న నిధుల్లో 50శాతం స్థానిక ప్రభుత్వాలకు ఇవ్వడం న్యాయమని, అంతకాకపోయినా 30 శాతమైనా కేటాయించాలని అన్నారు. కేంద్రం నుంచి వచ్చే కేటాయింపుల్ని కూడా దారిమళ్లించటం తప్ప రాష్ట్రాలు నేరుగా స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయటానికి ఇస్తున్న నిధులేవీ లేవన్నారు. గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల్లో అన్ని పనులూ జరగకపోవచ్చని, కానీ జనం జీవితాల్లో 80శాతం పనులు అక్కడే జరుగుతాయని అన్నారు. మన వద్ద పాస్‌పోర్టు కావాలంటే అదేదో మహానగరాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో చేసే పని అన్నట్టుగా చూస్తామని, కానీ పలు అభివృద్ధి చెందిన దేశాల్లో పాస్‌పోర్టుల్ని కూడా స్థానిక ప్రభుత్వాలే జారీ చేస్తాయని అన్నారు. గ్రామాలను బాగు చేయటానికి స్థానికంగా నిధుల్ని, అధికారాల్ని అందించటంతోపాటు వ్యవసాయాన్ని బాగు చేయటం కూడా అవసరమన్నారు.

రైతులు ధర వచ్చేదాకా పంటల్ని దాచుకోవడానికి గిడ్డంగులు లేవుగానీ, ఎగుమతుల్ని సైతం నిషేధించి ఆహారధాన్యాల్ని ముక్కబెట్టేందుకు గిడ్డంగుల్ని పెద్దఎత్తున వృధా చేస్తున్నారని జేపీ అన్నారు. పైన ఆచ్ఛాదనలు లేకుండా, పందికొక్కులు, ఎలకలు కొట్టేస్తున్నా ఆహార నిల్వల్ని కొనసాగిస్తున్నారన్నారు. దేశ ప్రజల అవసరాలకు మించి టన్నులకొద్దీ ధాన్యాలు మూలుగుతున్నాయన్నారు. అవసరానికి మించిన ఆహారాల్ని ఎగుమతి చేయటం, మన వద్ద డిమాండ్ ఉన్న పప్పులు, వంటనూనెలు వంటి వాటి మీద దిగుమతి సుంకాలు వేసి ఆ డబ్బును మన రైతులకు ప్రోత్సాహకాలుగా ఇవ్వడం చేస్తే రైతులకు కొంత ఆదాయం పెరుగుతుందని, దేశానికి కూడా ఆదాయం, స్వయంసమృద్ధి సమకూరతాయని అన్నారు.

సమావేశంలో లోక్‌సత్తా, వైబీఐ ప్రతినిధులు పాల్గొన్నారు. □

> పారిశ్రామికవేత్తల కోసం ఏపీ ప్రభుత్వం పౌరసేవల చట్టం తెచ్చిందని, అలాంటి చట్టాన్ని సామాన్య ప్రజలకు ఎందుకు వర్తింపచేయటంలేదని జేపీ ప్రశ్నించారు. దాదాపు 70శాతం ప్రజలు లంచాలిచ్చామని చెబుతున్నారని, వారికి లంచాలు బాధ తప్పించేందుకు ఎలాంటి చట్టాలు తేవాలో ఆలోచించకుండా, గతిలేక లంచం ఇచ్చిన ప్రజలకు కూడా జైలుశిక్ష వేస్తామనే దారుణమైన చట్టాన్ని తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. రక్షించాల్సిన ప్రజల్ని శిక్షించటం, శిక్షించాల్సిన లంచగొండి అధికారులను రక్షించటం పాలకులు చేయాల్సిన పనేనా? జనం ఆలోచించాలని జేపీ అన్నారు.

# నాణ్యమైన విద్యతోనే నిజమైన విప్లవం

సమాజం, ప్రపంచం మారుతున్నా మన విద్యావిధానంలో ఇంకా సరైన మార్పులు రాలేదని, విద్యారంగం అభివృద్ధి చెందితేనే మిగిలిన రంగాల అభివృద్ధి సాధ్యమవుతుందని జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా తిరుచానూరులోని ఎడిఫై పాఠశాల విద్యార్థులతో జేపీ మాటామంతీ నిర్వహించారు. ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా చర్చలో పాల్గొన్నారు.

విద్యారంగంలో భారతదేశం స్థానమేమిటో ప్రపంచం ముందు బైటపట్టిన 'పీసా' సర్వే గురించి తాను విస్తృతంగా ప్రచారం చేశానని, ఆ సర్వేలో 74 దేశాల మధ్య భారత్ 73వ స్థానంలో ఉందని జేపీ అన్నారు. తర్కం, లెక్కలు, విశ్లేషణ వంటి నిజమైన విద్యాప్రాతిపదికలతో ఈ సర్వే చేశారన్నారు. పీసా సర్వేలో బైటపడ్డ విషయాలను చూసి దిద్దుబాటు చేసుకోకుండా.. ఇక ముందు ఆ సర్వేలో పాల్గనబోమంటూ భారత్ చాన్నాళ్లు తప్పించుకుందన్నారు. ఇటీవలే మళ్లీ సర్వేకు అంగీకరించినట్టు వార్తలచ్చాయన్నారు. పీసా సర్వే గురించి తాను అనేకమార్లు చెప్పినా దాని గురించి విద్యాసంస్థల నుంచి చర్చ రావటం తక్కువని, ఎడిఫైలో ఆ అంశాన్ని ప్రస్తావించటం ఆనందంగా ఉందని జేపీ అన్నారు. ఉపాధ్యాయులు ముఖ్యమైన ప్రశ్నల్ని లేవనెత్తుతున్నా.. విద్యార్థుల నుంచి ఎక్కువ ప్రశ్నలకు ఆయన ప్రాధాన్యమిచ్చారు.

పీసా సర్వే కొన్నేళ్ల క్రితం చెప్పిన విషయాలకు, ఇప్పటికీ మన విద్యావ్యవస్థలో నాణ్యత పెద్దగా పెరిగిందేమీ లేదని, విద్యను హక్కుగా చేస్తూ వచ్చిన చట్టం వల్ల ప్రభుత్వ స్కూళ్లలో ఎన్‌రోల్‌మెంట్లు ఉన్నకొద్దీ తగ్గాయని



జేపీ అన్నారు. విద్య మీద ప్రభుత్వం చేస్తున్న ఖర్చులో సగం డబ్బుతోనే కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, పలు ప్రైవేటు స్కూళ్లలో మెరుగైన చదువు అందుతోందని అన్నారు. పీసా సర్వేతో ప్రపంచ దేశాల ముందు అవమానం జరిగినా, ఇంత డబ్బును విద్యార్థుల మీద ఖర్చు చేస్తున్నా ఎందుకు విద్యారంగం అధ్వాన్నంగా ఉందన్న చర్చ లేకపోవడం వల్లే పరిస్థితి మెరుగుపడటం లేదన్నారు. స్కూళ్లలో చదువు ఎలా ఉందో పర్యవేక్షించాలన్న ఆసక్తి ముఖ్యమంత్రి దగ్గర్నుంచీ గుమాస్తా వరకూ ఎవరికీ లేదన్నారు. విద్య బాగుపడకుండా రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందటం జరగదన్నారు.

మార్కులు, ర్యాంకుల కోసం బట్టీపట్టకుండా ప్రతి విషయాన్నీ క్షుణ్ణంగా అర్థం చేసుకుని తన కోసం, సమాజం కోసం వినియోగించినప్పుడే ప్రతి ఒక్కరికీ మంచి విద్య అందినట్లని జేపీ అన్నారు. ఇలా నైపుణ్యం, ఆత్మవిశ్వాసం, విలువలు ఉన్న విద్యార్థులు తయారైతే భారతదేశం తిరుగులేని గొప్ప శక్తిగా తయారవుతుందన్నారు. ర్యాంకుల విషయంలో తల్లిదండ్రుల తీరు కూడా మారాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సమాజం భాగస్వాములయ్యేలా ప్రభుత్వ విధానాలుంటే.. విద్యలో గొప్ప మార్పు వస్తుందని, దేశంలో ప్రతిరంగాన్నీ స్పృశించే నిజమైన విప్లవం వస్తుందని అన్నారు. ఇందుకోసమే సురాజ్య యాత్రన్నారు.

ఎలాంటి ఉద్యోగాలు, వ్యాపారావకాశాలు వస్తాయో ఎవరూ ఊహించలేని కాలంలో మనం ఉన్నామని, మానవ జాతి చరిత్రలోనే ఇదో గొప్ప తరుణమని, దీన్నో సదవకాశంగా కాపాడుకోవాలంటే మాత్రం నిరంతర అధ్యయనాన్ని కూడా చదువులో, జీవితంలో భాగం చేసుకోవాలని జేపీ అన్నారు. విద్య, సామాజిక, సాంకేతిక రంగాలపై విద్యార్థుల సందేహాలకు సమాధానాలిచ్చారు.

ఎడిఫై పాఠశాల నిర్వాహకురాలు సులోచన, డైరెక్టర్ పి. ప్రణీత్, ప్రిన్సిపల్ లక్ష్మీ ఎస్ నాయర్, పద్మావతీ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రంగనాయకులు, రాజేష్, లోక్‌సత్తా, వైబీఐ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. □

# డిజిటల్ అక్షరాస్యతపై అందరూ దృష్టిసారించాలి



డిజిటల్ అక్షరాస్యతపై అందరూ దృష్టి సారించాలని జేపీ పిలుపునిచ్చారు. సురాజ్య యాత్రను ప్రధానంగా సాంకేతికతను వినియోగిస్తూనే ఈతరం వినూత్న ఉద్యమంగా రూపొందించామన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా తాడేపల్లిగూడెం వచ్చిన జేపీ.. ప్రథమ్ కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని సందర్శించారు.

కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారు, లేనివారు అనే ఒక కొత్త విభజన మన సమాజంలో ఏర్పడుతోందని, సాధ్యమైనంత త్వరగా ఈ విభజనను అంతం చేయాలని జేపీ అన్నారు. లేనిపక్షంలో సమాజంలోని ఒక గణనీయమైన సమూహం అభివృద్ధి ఫథకాలను అందుకోలేని స్థితిలోకి నెట్టివేయబడుతుందన్నారు. విద్యారంగంలో నాణ్యతను పెంపొందించేందుకు సాంకేతికతను పెద్దఎత్తున వినియోగించుకోవాలన్నారు. అందుకోసం ఉపాధ్యాయులు, విద్యార్థులు విధిగా కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. అమెరికాలోని ఎంఐటీ సంస్థ అత్యంత చౌకగా విద్యాసాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజానికి అందించిందన్నారు. అదేవిధంగా మనదేశంలో కూడా తక్కువ ఖర్చుతో సాంకేతికతను ప్రజలకు చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. తాడేపల్లిగూడెంలోని ప్రథమ్ శిక్షణా సంస్థ ఒకటిన్నర సంవత్సరాల్లోనే 1400మందికి ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వటం సంతోషకరమన్నారు. ప్రభుత్వ సంస్థలు సైతం ఇదేమాదిరిగా పనిచేస్తే డిజిటల్ అక్షరాస్యత వ్యాప్తి చెందుతుందన్నారు.

సమావేశానికి అధ్యక్షత వహించిన కేంద్రం నిర్వాహకుడు డి.సోమసుందర్ మాట్లాడుతూ, విభిన్న సామాజికవర్గాలకు చెందిన ప్రజలకు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని ఉచితంగా అందిస్తున్నామన్నారు. పలు అంశాలపై సదస్సులు, సెమినార్లు నిర్వహిస్తున్నామన్నారు.

తొలుత జేపీ.. విద్యార్థులతో మాట్లాడి వారు నేర్చుకుంటున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు.

కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు పాలూరి లక్ష్మణరావు, పడాలి శ్రీనివాస్, దువ్వా శ్రీనివాస్, పోలిరాతి ఆదినారాయణ, పీఎంపీ అసోసియేషన్ నాయకులు వీబీటీ రాజు, ఎస్.కోటేశ్వరరావు, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, ప్రథమ్ సంస్థ శిక్షకులు పి.కిరణ్‌బాబు, ఆర్.దుర్గారావు, బండారు రామ్మోహనరావు, వైబీఐ ప్రతినిధులు పాల్గొన్నారు. ◻

# '10వ తరగతి తర్వాత ఏమి చెయ్యాలి?' బుక్‌లెట్ ఆవిష్కరణ




విద్యార్థుల జీవితాల్లో పదో తరగతి తర్వాత వేసే అడుగు కీలకమైనది. ఈ దశలో సరైన దిశానిర్దేశం అందక చాలామంది కెరీర్ ఒడిదుడుకుల్లో పడుతుంది. పది తర్వాత తాము ఇష్టంగా చదువుకుని ఎదగగల కోర్సు ఏమిటో గుర్తించే శక్తి తెలుగు రాష్ట్రాల్లో చాలామంది విద్యార్థులకు, తల్లిదండ్రులకు కూడా లేదు. దశాబ్దాలుగా భ్రష్టుపట్టిన మన విద్యావ్యవస్థ వల్లే ఈ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో, ముఖ్యంగా గ్రామీణ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉపయోగపడేలా '10వ తరగతి తరువాత ఏమి చెయ్యాలి?' అనే బుక్‌లెట్‌ను వికాస్ ప్రాజెక్టులో భాగంగా అమ్మ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ (అశ్వ) అనే స్వచ్ఛంద సంస్థ రూపొందించింది. ఇటీవల లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఈ పొత్తాన్ని ఆవిష్కరించారు. చార్టుల రూపంలో రూపొందించిన ఈ బుక్‌లెట్ విద్యార్థులకు, తల్లిదండ్రులకు కూడా చాలా ఉపయోగపడుతుందని, సంస్థ సారథుల సేవాభావం, సామాజిక స్పృహ అభినందనీయమని భుజం తట్టారు. సమాచార సాంకేతికరంగం, ఫిషరీస్ తదితర రంగాల్లో వస్తున్న నూతన అవకాశాలను, సమాజానికి ఉపయోగపడుతూ ఉపాధిని సృష్టించుకునే క్రమంలో స్థానికంగా ఉన్న వనరులను వినియోగించుకోవటం వంటి అంశాలను కూడా బుక్‌లెట్‌లో చేర్చాలని సూచించారు. ◻

# ప్రాచీనమా? ఆధునికమా?

**భా**షాసాహిత్యాలనే సమాసం పాతదే, అందమైనది కూడా. కానీ, భాష సాహిత్యరంగానికి మాత్రమే చెందినది కాదు. మాండలికాలు, యాసలు- అన్నీ సృజనాత్మక సాహిత్యాలలో కొనసాగుతాయి. వాటికి వచ్చిన ప్రమాదం ఏమీ లేదు. భాషకు సాహిత్యరంగానికి మించిన పరిధీ ప్రయోగమూ ఉంటాయి. గురజాడ, గిడుగు వంటివారు వ్యవహారభాష కోసం చేసిన పోరాటం సాహిత్యంలో గ్రాంధికం స్థానంలో వ్యవహారభాష తీసుకురావడం అనే పరిమిత ప్రయోజనం కోసం కాదు. సార్వత్రిక విద్య అందుబాటులోకి వస్తున్న దశలో విద్యాబోధనకు అనువుగా భాషావినియోగాన్ని సంస్కరించుకోవడం కోసం. విద్య ఒకనాడు ప్రాథమికమైన గణితానికి, వైద్యం వంటి కొన్ని పారంపరిక విద్యలకు, సాహిత్యరంగానికి, తత్వశాస్త్రానికి, వ్యాకరణానికి పరిమితమైనది. ఆధునిక విద్య భూగోళ విజ్ఞానానికి, భౌతిక రసాయన శాస్త్రాలకు, యాంత్రిక సాంకేతిక తదితర రంగాలకు కూడా విస్తరించింది. ఈ రంగాలలో పరిజ్ఞానం వినిమయానికి భాష ఒక వాహిక. ఆధునిక తెలుగు భాషాప్రస్థానం ఆధునిక శాస్త్రాల అధ్యయనానికి పనికివచ్చే రీతిలోనే మొదలయింది. కానీ, అతి త్వరలోనే శాస్త్రభాషగా అది సమస్యలను ఎదుర్కొనసాగింది. ప్రపంచంలో విజ్ఞానం వృద్ధి చెందుతున్న వేగాన్ని భాష అందుకోలేక పోతున్నది. ఏ సమాజానికైనా భాష అత్యంత ప్రాథమికమయిన వనరు. చారిత్రకమయిన, సాంస్కృతికమయిన సంపద కూడా. ఆధునిక అభివృద్ధికి కీలకమయిన వనరుగా తెలుగును తీర్చిదిద్దుకోవడంలో తెలుగు సమాజాలు విఫలం అవుతూ వస్తున్నాయి. తెలుగు పేరుతో అధికారానికి వచ్చిన ప్రభుత్వాలు కూడా తెలుగును ఆధునికమయిన, సమర్థమయిన సాధనంగా తీర్చిదిద్దడానికి కావలసిన మౌలిక వనరులు సమకూర్చలేకపోయాయి.

విశిష్ట భాషగా తెలుగుకు గుర్తింపు రావడం గర్వకారణమే. తెలుగులోని ప్రాచీన వాఙ్మయం అంతా కూడా పరిశీలనకూ పరిశోధనకూ యోగ్యమైనదే. ఆ పరిశీలనలూ పరిశోధనలూ తెలుగు భాష వర్తమానానికీ, భవిష్యత్తుకూ ఉపయోగపడతాయి. కానీ తెలుగు అంటే గతం మాత్రమే అనుకుంటే పొరపాటు. తెలుగు వేడుకలు జరుపుకోవడం అంటే ఆశుకవిత్వాలు, అవధానాలూ, అన్నమయ్య కీర్తనలు పాడుకోవడం అనుకుంటే సరి కాదు. రేపటి



తెలుగు కోసం ఆలోచన చేయకుండా తెలుగు వేడుకలు ఎట్లా సాధ్యం? ఒక్క ఆధునిక భాషాశాస్త్రవేత్త కూడా పాల్గొనకుండా, భాష గురించి ఏమి చర్చించగలం?

తెలుగును బౌద్ధిక, వైజ్ఞానిక భాషగా తీర్చిదిద్దడం ఎట్లా? వివిధ శాస్త్రరంగాలకు చెందిన పరిభాషను తెలుగులో సొంతంగా రూపొందించడం ఎట్లా? అత్యంత సంక్లిష్టమయిన వైజ్ఞానిక (భౌతిక, తాత్విక) భావనలను తెలుగులో వ్యక్తం చేస్తూ, వాటికి జోడింపులు ఇవ్వడం ఎట్లా?- అన్నవి తెలుగు భాషకు ఎదురవుతున్న సవాళ్లు. ఒక భాషా వ్యవహర్తలు భాష ప్రాతిపదిక మీద సంఘటితం అయ్యారంటే, ఆ ఐక్యత భాష అనే వ్యవస్థ బాగోగుల కోసం కాదు. ఆ భాషా వ్యవహర్తల జీవనప్రమాణాల ఎదుగుదల కోసం. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్ర ప్రాంతం వేర్పాటును కోరినా, తమిళం హిందీ ఆధిపత్యం మీద పోరాటం చేసినా- తమ సమాజాల అభివృద్ధి కోసం. తూర్పు బెంగాల్ పాకిస్థాన్‌తో మతపరమైన ఐక్యత కలిగి ఉన్నా, భాష వేరు కావడం వల్ల బంగ్లాదేశ్‌గా విడిపోయింది. మతం ఒకటే అయిన చోట భాష ప్రాతిపదికగా వివక్ష ఉండింది. భాష ఒకటే అయినా మత ప్రాతిపదికనో, ప్రాంతం, కులం, మాండలికం వంటి ప్రాతిపదికల మీద అసమానతలు ఏర్పడవచ్చు. పైన ఇచ్చిన అన్ని ఉదాహరణలలోను, వేరు వేరు అస్తిత్వాల వల్ల అభివృద్ధిలో తేడాలు వచ్చాయి. అభివృద్ధిలో వెనుకబడిన సమూహాల భాష కానీ, మాండలికంగానీ భాషావ్యవస్థలుగా కూడా వెనుకబడతాయి. ఏ కారణాల వల్ల అయితేనేమీ పారిశ్రామికంగా, ఆర్థికంగా ఉన్నతస్థితిలో ఉన్నచోట, అక్కడి భాష కూడా సమర్థంగా, సంపన్నంగా ఉంటుంది. భాష సంపన్నతకు సమాజ సంపన్నతకు పరస్పరమైన సంబంధం ఉంటుంది. కాబట్టి, భాష ప్రాతిపదికన కాక, ప్రాంతం ప్రాతిపదికన వేర్పాటును కోరుతున్న తెలంగాణ, ఒక సమాజంగా పురోభివృద్ధి సాధించాలంటే, తాను మాట్లాడే భాషను అభివృద్ధి పరచాలి.

కంప్యూటర్‌కు తెలుగు పూర్తిగా వెలిగా ఉన్నదని కాదు. కొన్ని కొన్ని అప్లికేషన్లలో తెలుగులో సూచనలు కనిపిస్తున్నాయి. తెలుగు అక్షరాలను టైప్ చేయగలుగుతున్నాయి. మూడున్నర దశాబ్దాల కిందటే డెస్క్‌టాప్ పబ్లిషింగ్ కోసం తెలుగు ఫాంట్లు సిద్ధమయ్యాయి. అప్పటి నుంచి పుస్తక ప్రచురణ, పత్రికా ప్రచురణ కోసం ఫాంట్ల అభివృద్ధి, తెలుగు టైప్ చేయడానికి వీలైన సాఫ్ట్‌వేర్ పరికరాల రూపకల్పన జరుగుతూనే ఉన్నాయి. కంప్యూటర్ భాషావరణం అంతా ఇంగ్లీషులోనే ఉంటుంది. ఒక విడి అప్లికేషన్‌ను, టూల్‌బార్‌ను ఇన్‌స్టాల్ చేసి తెలుగు టైప్ చేసుకోవాలి. తెలుగు టైప్ చేస్తున్నప్పుడు ఇంగ్లీషు, ఇంగ్లీషు వాడుతున్నప్పుడు తెలుగు పనిచేయవు. తెలుగును టైప్ చేయడానికి వాడే కీబోర్డ్ లేఅవుట్స్ కూడా అనేకం వాడుకలో ఉన్నాయి. తెలుగుకు ఏకైక కీబోర్డ్ స్థిరపరచడం మంచిది. తెలుగులో యూనికోడ్‌ను అభివృద్ధి చేసిన తరువాత, దాని వాడకం పెంచాలని నెటిజన్ నిపుణులు పదే పదే కోరుతున్నారు. కానీ, యూనికోడ్ వాడకం ఇంకా నామమాత్రంగానే ఉన్నది. పుస్తక ప్రచురణ సంస్థలు, ఒకటి రెండు పత్రికలు తప్ప తక్కినవి ఇంకా నాన్-యూనికోడ్ ఫాంట్లనే వాడుతున్నాయి. యూనికోడీకరణ జరిగితేనే సెర్చి ఇంజన్లు తెలుగు విషయాన్వేషణకు అనువుగా ఉంటాయి. డిజిటలైజేషన్ అంటే మన దృష్టిలో ఇంకా పీడీఎఫ్‌గానో, ఇతర ఇమేజ్ ఫార్మాట్ ఫైల్స్‌గానో భద్రపరచడం మాత్రమే. ఇంగ్లీషు ఇమేజ్ ఫైల్స్ నుంచి పాఠ్యాన్ని దిగుమతి చేసుకోగలిగిన సాఫ్ట్‌వేర్స్ ఎప్పటి నుంచో ఉన్నాయి కానీ, తెలుగు ఇమేజ్ ఫైల్స్ నుంచి తెలుగును రాబట్టే సాఫ్ట్‌వేర్ లేదు. కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని లాంగ్వేజ్ కంప్యూటేషన్ లాబ్‌లో సుదీర్ఘకాలంగా చేస్తున్న ప్రయత్నాలు మంచి ఫలితాలే ఇచ్చాయి కానీ, అవి వాణిజ్య ఆపరేటింగ్ సిస్టమ్స్‌కు అనువుగా రూపొందించినవి కావు. భాష కంప్యూటీకరణకు కావలసిన భాషానైపుణ్యం భాషా శాస్త్రవేత్తల నుంచి సమకూరాలి. ఎక్కడున్నాయి భాషాశాస్త్ర విభాగాలు? సామాజిక శాస్త్రాల అధ్యయనం అనవసరం అనుకున్న దాని పర్యవసానాలేమిటో తెలుగు సమాజాల అనుభవంలోకి వస్తున్నది. కంప్యూటర్లలో, మొబైల్ ఫోన్లలో ఇంగ్లీషు అక్షరాలతో తెలుగును రాసే అలవాటు పెరిగిపోయిన తరువాత, లిపితో పరిచయం తగ్గిపోతున్నది. తెలుగు అక్షరాలు చదవలేకపోయినా, తెలుగులో రాయగలిగినవారు పెరుగుతున్నారు. చదవకలేకపోయినవారి జనాభా పెరిగితే, రాసినవాటిని చదివేవారెవరు? కాబట్టి భాషను రక్షించుకోవడం అంటే, భాషను వినియోగించుకుని పద్యాలూ పాటలూ రాసేవారిని సత్కరించడం కాదు. అటువంటి పోషణ అవసరమనుకుంటే దాన్ని వేరుగా చేసుకోవచ్చు.

తెలుగులో ఒక నిరంతర నిఘంటు వ్యవస్థ ఉండాలి. అది కేంబ్రిడ్జి, ఆక్స్‌ఫర్డ్ నిఘంటువుల వలె, ఏదైనా విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఏర్పాటు చేయాలి. ఈ నిఘంటువు, ఆధునిక పదజాలాన్ని రూపొందించడానికే కాక, ఇప్పటిదాకా తెలుగు నిఘంటువులో చేరని ప్రాంత, కుల, వర్గ మాండలికాలకు అన్నిటికీ ప్రవేశం కల్పించాలి. పరిభాషా నిర్మాణానికి శాస్త్రీయ విధానాలను అనుసరించాలి. పరభాషా పదాల స్వీకరణపై నియంత్రణ ఉండాలి. పాఠ్యపుస్తకాలు, పత్రికలు – ఈ రెండూ భాష ప్రమాణీకరణకు ముఖ్యమైన వేదికలు. ఈ రెండు ముఖద్వారాల వద్ద భాషను సమన్యాయం పాటించే వ్యవస్థగా, ఆధునిక అవసరాలకు పనికివచ్చే సాధనంగా తీర్చిదిద్దడానికి గట్టి బందోబస్తు చేయాలి. సృజనాత్మక రచనలలో భాష ఎటువంటి పోకడలైనా పోవచ్చు, సాధారణ విషయరచనా భాష సరళంగా, సూటిగా, ప్రామాణికంగా ఉండేట్టు చూడాలి.

రాతలో దానికి అన్ని సామర్థ్యాలూ అలవరచాలి.




భాషకు, సమాజాభివృద్ధికి ఉన్న సంబంధాన్ని ప్రస్తుత తరం రాజకీయవాదులు చూడలేకపోవచ్చు. పైగా, భాషల చుట్టూ ఉండే ఉద్వేగాలను సంతృప్తిపరచడమే వారికి తక్షణ అవసరంగా కనిపించవచ్చు. ఇంగ్లీషు అభివృద్ధి చెందిన భాష కాబట్టి, సంపన్న దేశాల భాష కాబట్టి, ఆ భాషను వరిస్తే తమకు ఉపాధి, సాధికారత సిద్ధిస్తాయని దళిత, బహుజనవాదుల్లో కొందరు వాదిస్తుండవచ్చు. దాని మీద విస్తృతమైన చర్చ జరగాలి. ఆ వాదన వెనుక ఉన్న ఆవేదన అర్థం చేసుకోవలసిందే. కానీ, ఆవేదనల నుంచి, ఉద్వేగాల నుంచి వచ్చే వాదనలు అన్నివేళలా శాస్త్రీయమైనవీ, నిజంగా పురోభివృద్ధికి తోడ్పడేవీ కాకపోవచ్చును. ఇంగ్లీషు వ్యవహర్తల సమాజం అభివృద్ధి చెందింది కాబట్టి, ఇంగ్లీషుకు ఆ శక్తి వచ్చింది కానీ భాషలో ఆ శక్తి లేదు. సంపన్న సమాజాల భాషను వరిస్తే, మనది సంపన్న సమాజం కాబోదు, శాస్త్రవిజ్ఞానాన్ని దేశభాషల్లో నేర్పగలిగితే, నేర్చుకోగలిగితే అభివృద్ధి సాధ్యమని గుర్తించినందువల్లనే, నిజాం ప్రభుత్వం ఉర్దూలో భౌతిక శాస్త్రాలను, వైద్యశాస్త్రాన్ని అనువదింపజేయడానికి నాటి ఉస్మానియా యూనివర్సిటీలో ఒక ప్రత్యేక విభాగమే ఏర్పాటు చేసింది. నేటి మన నాయకులు గొప్పగా చెప్పే దక్షిణ కొరియా,

చైనా దేశాల్లో ఇంగ్లీషు వాడకం నామమాత్రం. అనేక విషయాల్లో వారి పోలిక తెచ్చే మనం భాషా విధానం విషయంలో వారి నుంచి నేర్చుకోవలసింది లేదా?

మార్కెట్ పరిభాషలో మాట్లాడవలసి వస్తే, తెలుగులో అందించే సందేశాలకు 15 కోట్ల ప్రజల మార్కెట్ ఉన్నది. అదేమీ చిన్న విషయం కాదు. ఒక భాష మాట్లాడే వ్యవహర్తలు ప్రపంచవ్యాప్తంగా 15 కోట్ల మంది ఉంటే, ఆ భాషా వ్యవహర్తలకు ఒక సమూహంగా ఉన్న రాజకీయ, ఆర్థిక బలం విశిష్టమైనది. తెలుగువారు ఆ హంగును వదులుకోవడం ఎందుకు? ఉమ్మడి తెలుగు పేరుతో ఏర్పడే మార్కెట్ నుంచి ఒక ప్రాంతపు తెలుగువారే లబ్ధి పొందుతారు కాబట్టి, ఉమ్మడి తెలుగే ఉందనుకోవడం సరికాదు. రెండు వేర్వేరు రాజకీయ, పాలనా యూనిట్లుగా మారిన తరువాత అనుచిత లబ్ధి ఎవరూ పొందకుండా చూసుకోవడం సులభం. లేదా, ఇంతకాలం బాధిత ప్రాంతంగా ఉన్నవారే తెలుగును తమ ప్రయోజనాలకు అనుకూలంగా మలచుకోవడమూ సాధ్యం.

అలనాటి ఆంధ్రరాష్ట్రం కానీ, హైదరాబాద్ రాజ్యంలోని తెలంగాణ కానీ, తెలుగుకు తెలుగువారికి జరుగుతున్న అన్యాయాన్ని, వివక్షను ఆధారం చేసుకుని ఉద్యమాలు చేసి తమ తమ అభీష్టాలను నెరవేర్చుకున్నారు. భాష మీద అంత ప్రేమ ఉన్నవాళ్లు, కార్పొరేట్ విద్య, అమెరికా ఉద్యోగాలు వచ్చేసరికి, అదే భాషకు నిర్మొహమాటంగా నీళ్లదిలేశారు. ఒక భాషవర్గంగా, భాషాజాతీయతతో అభివృద్ధి చెందాలన్న కాంక్షను కోల్పోయి, అనువాద జాతిలాగా, బాడీషాపింగ్ అంగడిసరుకుగా ఉండడానికి సిద్ధపడిపోయారు. రేపొద్దున ప్రపంచగతి మారిపోయి ఏ చైనానో ఉపాధిగమ్యంగా మారితే, మనం మళ్లీ మాండరిన్ నేర్చుకోవడానికి పరుగులు తీయవచ్చు.

తెలుగు మాధ్యమంలో బోధించడం అన్న ఆదర్శం పోయి, తెలుగును ఒక అంశంగా నిర్బంధం చేస్తే చాలు అనుకునే వరకు వచ్చాము. భౌతిక శాస్త్రాలు, భూగోళం, సామాజిక శాస్త్రాలు.. వీటన్నిటిని తెలుగులో నేర్చుకోగలిగే ప్రయత్నాలు దీనితో నిలిచిపోతాయి. కొన్ని పద్యాలు, కొన్ని కథలు, కొంత వ్యాకరణం– దీనితో తెలుగు నేర్చుకోవడం పూర్తవుతుంది. శాస్త్ర పరిభాష ఆధునిక అవసరాల భాషగా రూపొందే అవకాశం తెలుగుకు ఎప్పటికీ ఉండదు. ఇప్పటికిప్పుడు బోధనాభాషగా తెలుగును అంగీకరించినా, రాత్రికి రాత్రి భాషాభివృద్ధి జరగదు. వివిధ భౌతిక, సామాజిక శాస్త్రాల ప్రస్తుత స్థాయికి, తెలుగులో వాటిని చెప్పడానికి కావలసిన భాషాస్థాయికి అంతరం బాగా పెరిగిపోయింది. తెలుగుకు కావలసిన శాస్త్రపరిభాషను రూపొందించడానికి, తెలుగులోకి దిగుమతి చేసుకోదగ్గ పదజాలాన్ని గుర్తించడానికి ఒక వ్యవస్థ లేకపోతే, ఒక్కో రచయిత ఒక్కో మాట, ఒక్కో పత్రిక ఒక్కో మాట ప్రవేశపెడతాయి. ఫలితం, పరిభాషామాండలికాల అవతరణ. అనేక సాంకేతిక పదాలకు రూపొందిస్తున్న తెలుగు అనువాదాల పదాలకు ఎటువంటి సమర్థనా ఉండడం లేదు. ఏ శాస్త్ర భావన ఆధారంగా ఒక సాంకేతిక పదం రూపొందుతుందో, ఆ భావనతో పరిచయం లేని వారు శుష్కఅనువాద పదాన్ని తెలుగు సాంకేతిక పదంగా అందిస్తున్నారు. ఇవి కూడా శాస్త్ర అంశాలలో ఒక స్థాయి వరకే., పరిశోధనాస్థాయిలో, లోతైన పరిశీలనాస్థాయిలో భావాలను, భావనలను తెలుగులో పలకాలంటే, ఆ శుష్కపదాలు కూడా రూపొందించగలిగే పరిస్థితి లేదు. అందుకే, ఆధునిక తెలుగు వ్యవస్థ నిర్మాణానికి ప్రామాణికమైన నిఘంటువులు కావాలి. ప్రాచీన భాషగా తెలుగు అవసరాలు వేరు. ఆధునిక భాషగా తెలుగు అవసరాలు వేరు. తెలుగు భాష పాతది అని చెప్పుకోవడంలో మనకు సంతోషం కలుగుతోందికానీ, మన తెలుగు ఆధునికం కావాలన్న తపన కనిపించడం లేదు. న్యాయ పరిభాష లేకుండా తీర్పులు ఎట్లా వస్తాయి? పరిపాలనాభాష లేకుండా ప్రభుత్వ జీవోలు ఎట్లా విడుదల అవుతాయి? ఇప్పుడేవో పరిభాషాకోశాలు అందుబాటులో ఉన్నాయి. అధికార భాషగా తెలుగు విఫలం కావడంలో ఆ పదకోశాల వైఫల్యం కూడా ముఖ్యమైనది.

> అన్నిటికంటే ముందు, భాషా విధానం ఏమిటో రెండు తెలుగు రాష్ట్రాలూ ప్రకటించాలి. దాని మీద చర్చను ఆహ్వానించాలి. ఇంగ్లీషును నేర్చుకోవలసిందే. రెండు మూడు భాషలను నేర్చుకోవడం భారతీయులకు కొత్తేమీ కాదు. మౌలికంగా ఏ భాషకు చెంది ఉన్నామనేది ముఖ్యం. ఈ భాషలో మనం మన చారిత్రక అస్తిత్వం నుంచి భవిష్యత్ గమ్యం దాకా ప్రయాణిస్తామనేది ప్రధానం. వేడుకలు, సంబరాలు, కానుకలు, వరాలు– ఇవన్నీ సరే. భాషకు మౌలిక వసతుల మీద పెట్టుబడి పెట్టండి. మహాసభలకు అయిన ఖర్చులో సగం చాలు. అది తెలుగును గౌరవంగా బతికిస్తుంది.

తెలుగు భాషా సమస్యలను గుర్తించి, దానిని ఆధునిక భాషగా మలచడానికి శాస్త్రవేత్తల, నిపుణుల వ్యవస్థ అవసరం. సాధ్యమైన సందర్భాలలో ప్రజలలో వాడుకలో ఉన్న పదజాలం నుంచి శాస్త్ర పరిభాషను ఆ వ్యవస్థ స్వీకరించగలగాలి. లేనిచోట్ల, ప్రజల వాడుకకు సాధ్యమైనంత అనువుగా ఉండే విధంగా పరిభాషను రూపొందించగలగాలి. ఈ నిర్ణయాలకు, నిర్ధారణలకు కొన్ని శాస్త్ర ప్రాతిపదికలుండాలి.

(తెలంగాణ రాష్ట్రంలో తొలి ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా.. 'భాషకోసం ఏం చేయాలి?' అని చర్చిస్తూ ఆంధ్రజ్యోతి సంపాదకులు డాక్టర్ కె.శ్రీనివాస్ రాసిన వ్యాసాల నుంచి) □

# ఒంటరి పోరాటం చేస్తున్న జేపీ

- శిరమణి నరేష్



ఎన్నికల రాజకీయాలకి విరామం ప్రకటించిన జేపీ, మళ్లీ ప్రజల్లోకి వెళ్లారు. కులాలు, కుంభకోణాలు, సినిమా పిచ్చి, అధికారం కోసం వికృత క్రీడల మధ్య నలుగుతున్న ఏపీలో జేపీ సురాజ్య యాత్ర చేశారు. ఆయన యాత్రకి మీడియా లైవ్‌లు లేవు, భారీ జనసమీకరణ లేదు, జెండాలు లేవు, ఫ్లెక్సీలు లేవు.. ఓ పదిమందితో కలిసి ఆయన ఏపీలో ప్రతి జిల్లాకు వెళ్లారు. ఒక్కొక్క జిల్లాలో 2,3 రోజులు పర్యటించారు. ఆయన తన యాత్రలో ప్రతి జిల్లాలో కనీసం ఒక ప్రభుత్వ పాఠశాలని, ఒక ప్రభుత్వ ఆస్పత్రిని, రెండు కాలేజీలని సందర్శించారు. గ్రామాలకి వెళ్లారు. విద్యార్థులతో, రైతులతో, గ్రామీణులతో, పట్టణ మధ్యతరగతి ప్రజలతో మమేకం అయి వారి సమస్యలు తెలుసుకుని, తనకున్న పరిజ్ఞానం, విశేషానుభవంతో కొన్ని పరిష్కారాలను కనుగొని చర్చించి నిగ్గుతేల్చి, వాటిని ముఖ్యమంత్రికి అందచేశారు. ఇవి అమలుచేస్తారా లేదా అనేది ప్రభుత్వం ఇష్టం.

లోక్‌సత్తా జేపీకి సురాజ్య యాత్ర చేయాల్సిన అవసరం ఎందుకొచ్చింది? దీనితో ఆయనకి వచ్చే లాభం ఏంటి? ఎన్నికల రాజకీయానికి విరామం ప్రకటించిన జేపీ మళ్లీ ఎన్నికల్లో పోటీచేస్తారా? ఇలా ఎన్నో ప్రశ్నలు.. జేపీ ఇవేమీ పట్టించుకోరు. తన మదిలో లక్ష్యం సుస్పష్టం. దేశంలో తను సాధించాలనుకున్న సంస్కరణల మీద స్పష్టత ఉంది. అవి ఎలా సాధించాలనేదానిపై పైకి కాస్త కన్ఫ్యూజన్ కనిపిస్తున్నా.. జేపీ అడుగు ఎప్పుడూ ముందుకేకానీ వెనక్కిపడదు.

జేపీ వల్లే మేం 2009లో ఓడిపోయాం అని తెదేపావాళ్లు తిడతారు. జేపీకి అక్రమంగా నిధులు వస్తున్నాయి అని రేవంత్‌రెడ్డి ఆరోపిస్తారు. లోక్‌సత్తా తెదేపాకి 'బీ' టీం అని వైకాపావాళ్లు ఆరోపిస్తుంటారు. తెలంగాణను అడ్డుకున్నది జేపీనే అని కొందరి కొందరికి కోపం, జేపీ రాష్ట్ర విభజనని అడ్డుకోలేదని మరికొందరి ఆగ్రహం. జేపీ ప్రపంచబ్యాంక్ ఏజెంట్ అని లెఫ్ట్‌పార్టీలు విమర్శిస్తాయి. తనని ఎవరు ఏమనుకుంటున్నారు? తనతో ఎవరున్నారు? ఇవన్నీ జేపీకి అనవసరం.. తను అనుకున్నది, తన శక్తి మేర చేసుకుంటూ పోవడమే తప్ప మరో ఆలోచన లేదు. 21 ఏళ్ల క్రితం ఐఏఎస్‌కి రాజీనామా చేసినప్పటి నుంచి పైసా ఆదాయం లేకపోయినా, అర్హతకు తగ్గ పదవి రాకపోయినా, ఏనాడూ విశ్రాంతి తీసుకున్నది లేదు. కనీసం పదిమంది రీసెర్చ్ స్కాలర్స్‌తో ఆయన కార్యాలయంలో ఎప్పుడూ అధ్యయనం జరుగుతూనే ఉంటుంది. ఇప్పుడు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా ఉన్న ఎంతోమంది, తాము విద్యార్థులుగా ఉన్నప్పుడు ఆయన దగ్గర మూడునెలలో ఆరునెలలో శిక్షణ పొందారు.

ప్రతి మనిషిలో లోపాలు ఉంటాయి. అలాగే జేపీలో కూడా ఉండొచ్చు (తనలోని లోపాల్ని వదిలేసి మంచిని నేర్చుకోండని జేపీ చెబుతుంటారు). కానీ జేపీ ప్రయత్నంలో నిజాయతీ ఉంది, దేశం మీద ప్రేమ ఉంది, జరుగుతున్న అన్యాయాలపై ఆగ్రహం ఉంది, పేదల సమస్యలపై ఆవేదన ఉంది, పరిష్కారాల్లో సాటిలేని స్పష్టత ఉంది.. అందుకే ఒంటరిపోరాటం చేస్తున్న జేపీకి యువత అండగా నిలవాల్సిన అవసరం ఉంది. ఎవరు తోడున్నా లేకున్నా ఆయన ప్రయత్నం ఆగదు, మనందరం కలిస్తే ఆయన ప్రయత్నం విజయవంతం అవుతుంది. దేశంలో కొన్నయినా మంచిపనులు జరుగుతాయి. లేదంటే నష్టపోయేది మనమే.

(కర్టెసీ: కొరడాన్యూస్ డాట్‌కామ్) □

# 2జీ కుంభకోణంపై తీర్పు ఆశ్చర్యపరచలా..

## ఈ కేసులో దేశానికి జరిగిన ఒకే ఒక్క మేలు లోక్‌సత్తా పిటిషన్ ద్వారానే జరిగింది: జేపీ



**2జీ** స్పెక్ట్రం కుంభకోణంలో అందరూ నిర్దోషులేనని సీబీఐ ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పు నిరాశ కలిగించినా ఆశ్చర్యం కలిగించలేదని.. నేరస్తులు బలవంతంగానో, దెబ్బల భయంతోనో నేరం ఒప్పుకోకపోతే మనదేశంలో కేవలం 6 నుంచి 10శాతం కేసుల్లోనే శిక్షలు పడుతున్నాయని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. 2జీ స్పెక్ట్రం కేసులో దేశానికి జరిగిన ఒకే ఒక్క మేలు సుప్రీంకోర్టులో లోక్‌సత్తా దాఖలు చేసిన పిటిషన్ ద్వారానే జరిగిందని, లాలూచీ అవినీతి కింద 122 అక్రమ కేటాయింపు లైసెన్సుల్ని రద్దు చేసి ఇక ముందు ప్రకృతి వనరుల కేటాయింపును ఇష్టమొచ్చినట్టు కాకుండా బహిరంగ వేలం ద్వారా నిర్వహించాలని లోక్‌సత్తా చేసిన వాదనను కోర్టు అంగీకరించిందన్నారు. దాని వల్ల 2జీ స్పెక్ట్రం డబ్బు దేశ ప్రజలకు తిరిగి దక్కటమే కాకుండా, బొగ్గు గనుల కేటాయింపు కూడా వేలం పాటల ద్వారా జరిగి భారీ ఆదాయం ఖజానాకు సమకూరిందన్నారు.

ఆరోజున సంయుక్త 2జీపై పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయాలని పార్లమెంటు సమావేశాలను పలు పార్టీలు బహిష్కరించాయని, కానీ జేపీసీ వేయటంకన్నా ముందు లక్షల కోట్ల ప్రజాధనాన్ని పరిరక్షించేలా లైసెన్సుల రద్దు ముఖ్యమని వాదించి 2010 డిసెంబర్‌లో లోక్‌సత్తా పిటిషన్ (423/2010) దాఖలు చేసిందని జేపీ గుర్తుచేశారు. లోక్‌సత్తా పిటిషన్ మీద జె.ఎం లింగ్డో, ఎన్.గోపాలస్వామి, టి.ఎస్ కృష్ణమూర్తి, పి.శంకర్, జూలియో రెబీరో, అడ్మిరల్ తహిల్యాని వంటి పలువురు సుప్రసిద్ధ పౌరులు సంతకాలు చేశారని, ప్రశాంత్ భూషణ్ న్యాయవాదిగా వ్యవహరించారని అన్నారు. ఆ లైసెన్సుల్ని రద్దు చేస్తూ ఫిబ్రవరి 2, 2012న తీర్పునిచ్చిన సుప్రీంకోర్టు వల్ల బొగ్గు, స్పెక్ట్రం వేలం పాటలు జరిగి ప్రభుత్వానికి అదనపు ఆదాయం సమకూరిందన్నారు. దేశ వనరులు అందరికీ అందేలా చేయడానికి ఇంకా పలు సంస్కరణలు అవసరమున్నప్పటికీ భారీ దోపిడీకి ఒక ప్రధాన మార్గం ఇక మూసుకుపోయిందన్నారు. 2జీ స్పెక్ట్రం లైసెన్సుల కుంభకోణంపై పదులవేల పోస్టుకార్డులతో, ప్రధానికి రూ.1 మనియార్డర్లతో ప్రచారయుద్ధం చేస్తూ ఓపక్కన ప్రజలను చైతన్యపరుస్తూనే లోక్‌సత్తా ఈ న్యాయపోరాటం చేసిందన్నారు. పిటిషన్‌లో భాగస్వాములైనవారందరినీ జేపీ మనసారా అభినందించారు.

బలహీనమైన, రాజకీయ జోక్యమున్న నేరపరిశోధన, ప్రాసిక్యూషన్, అధ్వాన్నమైన ఫోరెన్సిక్ మౌలికవసతులు, ఏళ్ల తరబడి విచారణ సాగే న్యాయవ్యవస్థతో మనం చట్టబద్ధ పాలనను అమలు చేయలేమని జేపీ అన్నారు.

దేశంలో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో మూడింట రెండొంతులు క్రిమినల్ కేసులేనని, 4 లక్షల ఖైదీల్లో 70శాతం ఇంకా విచారణ దశలోనే ఉన్నవారని, వీరిలో ఎక్కువమంది చావబాదటం వల్ల నేరాల్ని ఒప్పుకున్నవారేనని జేపీ వివరించారు. చట్టబద్ధపాలన, విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, వేధింపులు లేని సేవలు, పటిష్ట స్థానిక ప్రభుత్వాల విషయంలో అన్ని ప్రభుత్వాలూ విఫలమయ్యాయన్నారు. ఆటగాళ్లు మారుతున్నారు తప్ప ఆటనియమాలు మారటం లేదన్నారు. అవే పద్ధతులను అనుసరిస్తుండటం వల్ల అవే వైఫల్యాలు ప్రజలను పీడిస్తున్నాయన్నారు.

2జీ స్పెక్ట్రం తీర్పు మీద ఎవరినో తిట్టిపోస్తూ కూర్చోకుండా వ్యవస్థీకృత మార్పు కోసం కృషి చేయాలని, చట్టబద్ధపాలనను అమలు చేసే పోలీసు, ప్రాసిక్యూషన్, న్యాయవ్యవస్థ, న్యాయప్రక్రియలను సంస్కరించాలనే డిమాండ్ మనందరి నుంచి గట్టిగా వినిపించాలని జయప్రకాష్ నారాయణ్ ట్విట్టర్ ద్వారా విజ్ఞప్తి చేశారు. □

# జేపీ సురాజ్య ఉద్యమం కోసం 'నేను సైతం' అంటూ అందరం

- రాజీవ్
విద్యార్థిసత్తా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు



పల్లవి : ప్రజల కోసము - ప్రగతి కోసము
సాగుతోంది సురాజ్య యాత్రా చిలుకా
ఇది జేపీ జనహిత యాత్రా ॥ 2 ॥

చరణం1: నాణ్యమైన విద్య, ఆరోగ్యం - ఉచితంగా వస్తే
ఊరూరా మారుతుంది స్వర్గసీమలా
రైతు సంక్షేమమే ఈ రాజ్యధ్యేయమై
నడవాలి పాలన తీరు చిలుకా
నడవాలి పాలన తీరు .....॥ ప్రజల ॥



చరణం 2 : ఖర్చెంతో ఉన్నా - సర్కారీ బడులు
ఉపాధి, వ్యాపారాలకు పనికొచ్చే విద్యకు నోచుకోవులే
పన్నుల డబ్బే అప్పనపు సొమ్ముగా
తీర్చుతోంది కొందరి దాహం చిలుకా
తీర్చుతోంది కొందరి దాహం ....॥ ప్రజల ॥



చరణం 3 : దగ్గోదమ్మొస్తే - తుమ్మొ జ్వరమొస్తే
అవుతాయి జేబులన్నీ ఖాళీలులే
దవఖాన ఖర్చులే - దశ త్రాచు పడగలే
నెట్టేస్తాయి పేదరికంలోకి చిలుకా
నెట్టేస్తాయి పేదరికంలోకి ....॥ ప్రజల ॥

చరణం 4 : ఆపదలు ఊళ్లో - అధికారులు, పాలకులు యేడనో
మా పనులు మా వద్దే తేలాలె, జరగాలె
మా పన్నుల డబ్బే, మా కన్నుల ఎదుటే
కావాలి సద్వినియోగం చిలుకా
కావాలి వికేంద్రీకరణతో సద్వినియోగం.... ॥ ప్రజల ॥

Posting Date 07-01-2018
RNI Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on January 1st 2018



# దేశమంటే మనుషులు అని మరువొద్దు

దేశమంటే మట్టి కాదోయ్, మనుషులోయ్ అనే సత్యాన్ని మరువకపోవటం, సమాజానికి ఉపయోగపడే పని ద్వారా ఉపాధిని వెతుక్కోవటం చేస్తే చాలు.. యూత్ అద్భుతాలను సృష్టిస్తారని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ సంగారెడ్డి జిల్లా రుద్రారంలోని గీతం డీమ్డ్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతూ సూచించారు.

## Join & Participate: www.youthforbetterindia.com

| Book-Post<br>PRINTED MATTER | To |
|---|---|
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad